

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY


ఆవుల పుల్లారెడ్డి సేవా సమితి
రి.నెం. 119/2015
ఆళ్ళగడ్డ, కర్నూలు జిల్లా
ఉచిత కళ్యాణ మండపం
స్వయం ఉపాధి శిక్షణ
ఉచిత రక్తదానము
ఉచిత న్యాయ సలహాలు
ఉచిత కంప్యూటర్ శిక్షణ
సంప్రదించవలసిన చిరునామా
అధ్యక్షులు ఆవుల విజయభాస్కర రెడ్డి అడ్వకేట్ B.A.LL.B
ఆళ్లగడ్డ
9440232308,9494498787



PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 14 ఆగస్టు 2021 సంపుటి : 03 సంచిక :11 పేజీలు : 4 వెల : రూ 3-00


## అధికార, విపక్షాలు నాకు రెండు కళ్లు: వెంకయ్యనాయుడు



న్యూఢిల్లీ: సభాకార్యక్రమాల విషయంలో విపక్షాలు, అధికార పక్షం తనకు రెండు కళ్లని రాజ్యసభ చైర్మన్ ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. తనకు రెండూ సమానమేనని చెప్పారు. రెండు కళ్లు సరిగా ఉంటేనే చూపు స్పష్టంగా ఉంటుందని పేర్కొన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ముగిసిన అనంతరం శుక్రవారంనాడు ఆయన మీడియాతో మాట్లాడుతూ, విపక్ష, అధికార పక్షాలను తాను సమదృష్టిలో చూస్తానని, సభ సజావుగా నడిచేలా చూడాల్సిన బాధ్యత ఉభయులపైనా ఉంటుందని అన్నారు.సభలో నిరంతర అంతరాయాలపై మీడియా అడిగిన ప్రశ్నకు, చట్టసభలు ఉండేది చర్చలు, సంప్రదింపుల కోసమేనని, బయట జరిగే రాజకీయ కొట్లాటలకు పార్లమెంటు వేదక కారాదని అన్నారు. పార్లమెంటు సమావేశాల్లో చోటుచేసుకున్న కొన్ని అనుచిత ఘటనలపై తీసుకోవాల్సిన చర్యల గురించి పరిశీలిస్తున్నామని అన్నారు. బిల్లులను సెలక్ట్ కమిటీకి నివేదించే అంశంపై అడిగిన మరో ప్రశ్నకు వెంకయ్యనాయుడు సమాధానమిస్తూ, దీనిపై సభ సమష్టిగా నిర్ణయం తీసుకుంటుందని, సభాపతి (చైర్) బలవంతం ఏమీ ఉండదని అన్నారు. జూలై 19న పార్లమెంటు వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పెగాసస్ స్పైవేర్ వ్యవహారం, సాగు చట్టాల రద్దు అంశంపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో ఉభయ సభలూ వరుస వాయిదాలకే పరిమితమై, చివరకు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

## నకిలీ చలానాల కుంభకోణంపై జగన్ ఆరా



అమరావతి: నకిలీ చలానాల కుంభకోణంపై సీఎం జగన్ ఆరా తీసినట్లు తెలుస్తోంది. జగన్‌తో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. అక్రమార్కుల నుంచి సొమ్ము రికవరీపై దృష్టిపెట్టాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే రూ.40 లక్షల మేర రికవరీ చేశామని అధికారులు జగన్‌కు వివరించినట్లు తెలుస్తోంది. రిజిస్ట్రేషన్ల సాఫ్ట్‌వేర్‌లో మార్పులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. నకిలీ చలనాల కుంభకోణంపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని జగన్ ఆదేశించారు. మరోవైపు నకిలీ చలాన్ల వ్యవహారంలో దర్యాప్తు కొనసాగుతోంది. గుంటూరు, కర్నూలు జిల్లాల్లోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఆడిట్ బృందం తనిఖీలు చేసింది. గుంటూరు జిల్లా మంగళగిరి సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో కూడా తనిఖీలు చేశారు. కర్నూలు జిల్లా నంద్యాలలో సబ్ రిజిస్ట్రార్, జూనియర్ అసిస్టెంట్ సస్పెన్షన్ వేటు వేశారు. మరికొందరి పాత్రపై అధికారులు విచారిస్తున్నారు. ఇటీవల కడపలో ముగ్గురు సబ్ రిజిస్ట్రార్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్ల సస్పెన్షన్ వేటు వేశారు.

## రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా సత్యనారాయణరెడ్డి బాధ్యతలు



విజయవాడ: ఆంధ్రప్రదేశ్ రెడ్డి కార్పొరేషన్ చైర్మన్‌గా చింతలచెరువు సత్యనారాయణరెడ్డి పదవీ ప్రమాణ స్వీకారం చేశారు. శుక్రవారం తాడేపల్లి సీఎస్‌ఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన ప్రమాణ స్వీకారోత్సవంలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొని అభినందనలు తెలియజేశారు.గత నెలలో ఆంధ్రప్రదేశ్‌లో నామినేటెడ్ పోస్టులను భర్తీ చేసిన సంగతి తెలిసిందే. ఈ పోస్టుల భర్తీలో సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయం తీసుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 56 శాతం పదవులు కేటాయించారు. 137 పోస్టుల్లో మహిళలకు 69, పురుషులకు 68 పదవులు ఇచ్చారు.

## సీఎం జగన్‌ను కలిసిన నీతి ఆయోగ్ బృందం



అమరావతి: ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నీతి ఆయోగ్ బృందం శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఎస్‌డీజీ ఇండియా ఇండెక్స్ 2020-21 రిపోర్టును సీఎంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు, వివిధ రంగాల అభివృద్ధికి ఇస్తున్న ప్రాధాన్యతను సీఎం వైఎస్ జగన్ నీతిఆయోగ్ సభ్యులకు వివరించారు.కాగా అంతకముందు నీతిఆయోగ్ ఆధ్వర్యంలో సచివాలయంలో సస్టెయినబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ (ఎస్‌డీజీస్) ఇండియా ఇండెక్స్ 2020?21, మల్టీ డైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్(ఎంపీఐ)పై వర్క్‌షాప్ నిర్వహించారు. ఎంపీఐ ర్యాంకింగ్‌లో భారత్ 62వ స్థానంలో ఉందని నీతి ఆయోగ్ సలహాదారు వెల్లడించారు. మానవాభివృద్ధి సూచికలో ఏపీ అగ్రస్థానంలో ఉందని ఏపీ ప్రభుత్వం తెలిపింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధనలో ఏపీ 3వ స్థానంలో ఉందని.. త్వరలోనే మొదటి స్థానానికి చేరుకుంటామని ఏపీ ప్రభుత్వం నీతి ఆయోగ్‌కు స్పష్టం చేసింది. ఎస్‌డీజీ ర్యాంకింగ్స్‌లో రాష్ట్రాన్ని మొదటి స్థానంలో నిలిపేందుకు ఏ విధమైన ప్రణాళికతో ముందుకెళ్లాలనే అంశంపై చర్చించారు. ఏపీ ప్రభుత్వం సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించుకునేందుకు కృషి చేస్తుందని ముఖ్యమంత్రితో జరిగిన చర్చలో అధికారులు వెల్లడించారు. నవరత్నాలలో భాగంగా వివిధ సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేయడంపై పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిపారు. విద్య, వైద్యం, పేదరిక నిర్మూలన, వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ఏపీ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను నీతిఆయోగ్ సభ్యులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఎస్‌డీజీ లక్ష్యాల సాధనపై రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులకు నీతిఆయోగ్ ఆధ్వర్యంలో దిశానిర్దేశం చేసినట్లు అధికారుల బృందం సీఎంకు వివరించారు. ఈ కార్యక్రమంలో నీతిఆయోగ్ సలహాదారు శాన్యుక్తా సమద్దార్, నీతిఆయోగ్ ఎస్‌డీజీ ఆఫీసర్ అలెన్ జాన్, నీతిఆయోగ్ డేటా ఎనలటిక్స్ ఆఫీసర్ సౌరవ్ దాస్, ఏపీ ప్రణాళికాశాఖ కార్యదర్శి జీఎస్‌ఆర్‌కేఆర్ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏపీలోని 17 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అవకతవకలు: రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ

అమరావతి: ఏపీలోని17 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నకిలీ చలానాల అవకతవకలు జరిగినట్లు గుర్తించామని రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ శేషగిరిబాబు తెలిపారు. 10 సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఎక్కువగా అవకతవకలు జరిగినట్లు ఆయన పేర్కొన్నారు. ఇప్పటివరకు రూ. 5.25 కోట్ల అక్రమాలు జరిగినట్లు గుర్తించామని శేషగిరిబాబు వెల్లడించారు. ఇప్పటికే రూ.కోటి రికవరీ చేశామని, అవకతవకలపై ఆరుగురు సబ్‌రిజిస్ట్రార్లను సస్పెండ్ చేశామని అన్నారు.మిగతా సబ్‌రిజిస్ట్రార్లపై విచారణ జరుగుతోందన్నారు. అవకతవకలు జరిగిన



చోట్ల కేసులు నమోదు చేయిస్తున్నామని ఐజీ శేషగిరిబాబు అన్నారు. 2021 ఏప్రిల్ నుంచి జులై వరకు 54 నకిలీ చలానాలు గుర్తించినట్లు తెలిపారు. నకిలీ చలానాలతో రూ. 7లక్షల మేర గోల్‌మాల్ జరిగినట్టు నిర్ధారించారు. చలానాల గోల్‌మాల్‌లో డాక్యుమెంట్ రైటర్ల పాత్ర ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పొన్నూరు, భీమవరం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ రిజిస్ట్రేషన్ల శాఖ తనిఖీలు చేపట్టింది.

## జాతీయ జెండా ఆవిష్కరణ

అమరావతి రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చేపట్టే కార్యక్రమాల్లో తల్లిదండ్రుల కమిటీలకు అధిక ప్రాధాన్యమిస్తున్న ప్రభుత్వం..ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసింది. స్వాతంత్ర్య దినోత్సవం రోజైన ఆగస్టు 15 న పాఠశాలల్లో నిర్వహించే జెండా వందన కార్యక్రమాన్ని తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ల ద్వారా నిర్వహించాలని ఆదేశాలిచ్చింది. ఈ మేరకు రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ మండలి డైరెక్టర్ బి.ప్రతాప్ రెడ్డి గురువారం మెమో జారీ చేశారు. కోవిడ్ -19 ప్రోటోకాల్ ప్రకారం అన్ని జాగ్రత్తలు తీసు కొని.. స్వాతంత్ర్య దినోత్సవాన్ని నిర్వహించాలని సూచించారు. జిల్లా స్థాయిలో జాతీయ పతాకావిష్కరణను జిల్లా విద్యాధికారులు లేదా రీజనల్ జాయింట్ డైరెక్టర్లు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలల్లో మాత్రం తల్లిదండ్రుల కమిటీ చైర్మన్లతోనే పతాకాన్ని ఆవిష్కరింపజేయాలని స్పష్టం చేశారు.

## ఏపీలో కొత్తగా 1,746 కరోనా కేసులు, 20 మరణాలు

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో కరోనా ఉధృతి కొనసాగుతున్నది. గడిచిన 24 గంటల్లో 73,341 మందికి కరోనా నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా.. 1,746 మందికి పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. వైరస్ బారినపడిన వారిలో 1,648 మంది కోలుకున్నారు. 20 మంది మృతి చెందారు. ఏపీలో మొత్తం పాజిటివ్ కేసులు 19,90,656కు పెరిగాయి. ఇవాళ్టివరకు మొత్తం 19,58,275 మంది చికిత్సకు కోలుకున్నారు. ఇంకా 18,766 యాక్టివ్ కేసులున్నాయి. మొత్తం మరణాలు 13,615కు చేరినట్లు ఆ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ వెల్లడించింది.



## గవర్నర్ బిశ్వభూషణ్‌ను కలిసిన పీవీ సింధు, రజనీ



అమరావతి: టోక్యో ఒలింపిక్స్‌లో మంచి ప్రదర్శన కనబరిచిన పీవీ సింధు, రజనీ, సాయిరాజ్‌లు శుక్రవారం ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బిశ్వభూషణ్ సింధు, రజనీ, సాయిరాజ్‌లను ఘనంగా సన్మానించారు. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన పీవీ సింధు ఒలింపిక్స్‌లో వరుసగా రెండు పతకాలు సాధించిన మహిళగా రికార్డు సాధించింది. ఇక భారత మహిళల హాకీ జట్టులో రజనీ గోల్ కీపర్‌గా వ్యవహరించిన సంగతి తెలిసిందే. టోక్యో ఒలింపిక్స్‌లో మహిళల జట్టు మంచి ప్రదర్శన కనబరిచింది. ఎలాంటి అంచనాలు లేకుండా బరిలోకి దిగిన భారత మహిళల జట్టు 41 ఏళ్ల తర్వాత సెమీస్‌లోకి ప్రవేశించి చరిత్ర సృష్టించింది.

## వివేకా కేసులో విజయసాయిని విచారించాలి: బుద్దా వెంకన్న





విజయవాడ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ విజయసాయి రెడ్డి ఉత్తరాంధ్ర బందిపోటు అని టీడీపీ నేత బుద్దా వెంకన్న విమర్శించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గత రెండేళ్లుగా విజయసాయి ఉత్తరాంధ్రను పీల్చి పిప్పు చేస్తున్నారని మండిపడ్డారు. వైఎస్ వివేకా హత్య కేసులో ఏ-2ను సీబీఐ ప్రశ్నించాలని డిమాండ్ చేశారు. ఆయనను ప్రశ్నిస్తే వాస్తవాలు బయటకు వస్తాయన్నారు.వివేకానందరెడ్డి చనిపోయిన వార్త తెలిసిన వెంటనే జగన్మోహన్ రెడ్డి కంటే ముందు విజయసాయి వెళ్లారని, గుండెపోటుతో మృతి చెందారని ఆయన ప్రకటించారని వెంకన్న అన్నారు. వివేకా ఒంటిపై కత్తిపోట్లు కనిపిస్తున్నా.. గుండెపోటుతో మరణించారని, తర్వాత హత్య అని ఎందుకు చెప్పారని ప్రశ్నించారు. దీనిపై సీబీఐ విచారణ జరపాలని బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు.

## తిరుమల లో నకిలీ టికెట్ల వ్యవహారం

తిరుమల తిరుమలలో నకిలీ టికెట్ల వ్యవహారం కలకలం సృష్టించింది. భక్తులకు నకిలీ టికెట్లను అంటగడుతున్న దళారులు దందా గుట్టు రట్టు అయ్యింది. హైదరాబాద్ నుంచి వెళ్లిన భక్తులకు దళారులు మార్ఫింగ్ చేసిన రెండు రూ.300 టికెట్లను రూ.4,400కు విక్రయించారు. ప్రతిరోజూ కేటాయించిన రూ.300 దర్శనం కోటా టికెట్ల కంటే ఎక్కువ మంది రోజువారీగా శ్రీవారి దర్శనం చేసుకుంటున్నట్లు టీటీడీ, విజిలెన్స్ అధికారులు అనుమానం రావడంతో అధికారులు ఈ వ్యహారంపై నిఘా పటిష్ఠం చేశారు. అయితే, హైదరాబాద్ భక్తులు నేడు శ్రీవారి దర్శనానికి రావడటంతో ఈ మొత్తం వ్యవహారం వెలుగోలోకి వచ్చింది. మార్ఫింగ్ టికెట్ల వ్యవహారంపై విజిలెన్స్ అధికారులు విచారణ చేపట్టారు..

## 2డీజీతో కోవిడ్ రోగుల్లో బోలెడంత ఆక్సిజన్: రక్షణ మంత్రి

న్యూఢిల్లీ: 2డీజీ ( 2ఆఉ )ఔషధం చాలా ప్రభావంతంగా పనిచేస్తున్నదని డాక్టర్లు తనకు తెలిపారని, ఆ ఔషధాన్ని వాడడం వల్ల కరోనా రోగుల్లో ఆక్సిజన్ స్థాయి అమాంతంగా పెరుగుతందని ఇవాళ రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. ఇలాంటి ఔషధాన్ని మరే దేశం కూడా తయారు చేయలేదని మంత్రి చెప్పారు. కానీ భారతీయ శాస్త్రవేత్తలు ఆ అద్భుతాన్ని సాధించినట్లు ఆయన వెల్లడించారు. మన దేశానికి చెందిన సైనిక దళాలు, శాస్త్రవేత్తలు ఎన్నడూ దేశాన్ని నిరుత్సాహపరచలేదని ఆయన అన్నారు. కరోనా సెకండ్ వేవ్ ఉధృతంగా ఉన్న సమయంలో.. డీఆర్‌డీవో నేతృత్వంలో తయారు చేసిన 2డీజీ ఔషధాన్ని మార్కెట్లోకి రిలీజ్ చేసిన విషయం తెలిసిందే.ఇవాళ ఢిల్లీలోని డీఆర్‌డీవో భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మంత్రి రాజ్‌నాథ్ మాట్లాడారు. టోక్యో ఒలింపిక్స్ జరుగుతున్న సమయంలో.. భారత్‌కు గోల్డ్ మెడల్ వస్తుందో రాదో అన్న టెన్షన్ ఉండేదని, కానీ సుబేదార్ నీరజ్ చోప్రా అద్భుతం సాధించాడని, జావెలిన్ త్రో ఈవెంట్‌లో బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నట్లు మంత్రి రాజ్‌నాథ్ తెలిపారు.



## అత్యాచార బాధితురాలికి అండగా రాష్ట్ర మహిళా కమిషన్



వైఎస్సార్ కడప: కడప జిల్లాలో బాలికపై అత్యాచారం జరిగిన ఘటనలో బాధిత కుటుంబానికి రాష్ట్ర మహిళా కమిషన్ అండగా నిలిచింది. జిల్లా ఎస్పీతో మాట్లాడి కఠిన చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్ పర్సన్ వాసిరెడ్డి పద్మ కోరారు. బాలిక తల్లిదండ్రులతో ఆమె మాట్లాడి ధైర్యం చెప్పారు. కాగా మహిళా కమిషన్ సభ్యురాలు గజ్జెల లక్ష్మీ బాధిత బాలికను పరామర్శించారు.

# సంపాదకీయం

శనివారం 14 ఆగస్టు 2021

## లెఫ్టినెంట్ గవర్నర్ రూపంలో తిప్పలు

విపక్ష పాలిత రాష్ట్రాలను ఇరుకున పెట్టడం, చికాకులు కల్పించడం కేంద్రంలోని అధికార పార్టీలకు కొత్తేమీ కాదు. తొలి ప్రధాని పండిట్ నెహ్రూ నుంచి నేటి ప్రధాని నరేంద్ర మోదీ వరకూ అందరూ అనుసరిస్తున్న అనుచిత విధానమే ఇది. అయితే అప్పటికీ ఇప్పటికీ తీవ్రతలోనే తేడా ఉంది తప్ప నాయకుల వైఖరిలో మార్పు లేదన్నది చేదు నిజం. అధికార పార్టీకి నమ్మినబంట్లుగా ఉన్న వారిని విపక్ష పాలిత రాష్టాలకు గవర్నర్లుగా పంపడం, నిధులు, ప్రాజెక్టుల మంజూరులో వివక్ష వంటి కేంద్ర ప్రభుత్వ చర్యలు తెలిసినవే. తాజాగా దేశ రాజధాని నగరమైన ఢిల్లీ పోలీసు కమిషనరుగా రాకేశ్ ఆస్థానా ను నియమించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కొత్త వివాదానికి తెరలేపింది. ఇప్పటికే అరవింద్ కేజ్రీవాల్ నాయకత్వంలోని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సర్కారును లెఫ్టినెంట్ గవర్నర్ అనిల్ బైజాల్ ద్వారా చెడుగుడు ఆడుకుంటున్న కేంద్రంలోని మోదీ సర్కారు ఇప్పుడు ఢిల్లీ పోలీసు కమిషనర్ రాకేశ్ ఆస్థానా ద్వారా పట్టు పెంచుకోవాలని చూస్తోంది. దీన్ని ఆప్ సర్కారు తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఈ మేరకు అసెంబ్లీ ఒక తీర్మానాన్ని చేసి కేంద్రానికి పంపింది. మున్ముందు ఈ వివాదం ఎటు వైపు దారి తీస్తుందో చూడాలి. మరోపక్క రాకేశ్ ఆస్థానా నియామకాన్ని సవాల్ చేస్తూ మనోహర్ లాల్ శర్మ అనే న్యాయవాది సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వాజ్యం దాఖలు చేశారు. ఢిల్లీ పోలీసు కమిషనరుగా రాకేశ్ ఆస్థానాను నియమిస్తూ జులై 27న కంద్ర కేబినెట్ నియామకాల కమిటీ నిర్ణయం తీసుకుంది. ఆయన వెనువెంటనే అంటే జులై 28నే బాధ్యతలు చేపట్టారు. గుజరాత్ కేడర్ కు చెందిన రాకేశ్ ఆస్థానా జులై 31న పదవీ విరమణ చేయాల్సి ఉంది. కానీ ఆయన పదవీకాలాన్ని ఏడాదిపాటు పెంచింది. పదవీ విరమణకు ముందు మూడురోజుల క్రితమే రాకేశ్ ఆస్థానా నియామ కంపై ప్రకటన వెలువడటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. 2018 జులైలో ప్రకాశ్ సింగ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధంగా ఈ నియామకం ఉందని ఆప్ పార్టీ చెబుతోంది. కనీసం ఆరు నెలల పదవీ కాలం ఉన్న వారినే కీలక పోస్టుల్లో నియామకాలకు పరిశీలించాలని అప్పట్లో సర్వోన్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. ఈఏడాది మే నెలలో సీబీఐ డైరెక్టర్ పదవికి రాకేశ్ ఆస్థానా పేరు కూడా పరిశీలనలోకి వచ్చింది. ప్రధాని, భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ), లోక్ సభలో విపక్షనేతతో కూడిన కమిటీ సీబీఐ డెరెక్టర్ ను ఎంపిక చేస్తుంది. రాకేశ్ ఆస్థానాకు పదవీ కాలం ఆరు నెలల కంటే తక్కువ ఉన్నందున, 2018 నాటి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం ఆయన పేరును పరిశీలించలేమని అప్పట్లో సీజేఐ స్పష్టం చేశారు. దీంతో రాకేశ్ ఆస్థానా అవకాశం కోల్పోయారు. ఇప్పుడు ఈ విషయాన్నే ఆప్ వర్గాలు బలంగా ఎత్తి చూపుతున్నాయి. కేంద్రం తన నిర్ణయం మార్చుకోవాలంటూ ఈ మేరకు ఢిల్లీ అసెంబ్లీ ఒక తీర్మానాన్ని ఆమోదించి పంపింది. సహజంగానే విపక్షమైన బారతీయ జనతా పార్టీ ఈ తీర్మానాన్నితిరస్కరించింది. దేశ రాజధానికి సంబంధించిన వ్యవహారాల్లో కేంద్రానికి విశేష అధికారాలు ఉంటాయని, అందులో భాగంగానే రాకేశ్ ఆస్థానా నియామకం చేసిందని, ఇందులో రాజకీయాలకు తావులేదని ఢిల్లీ భాజపా ఎమ్మెల్యే రాంవీర్ సింగ్ వాదిస్తున్నారు. మోదీ హయాంలో గుజరాత్ లో వివిధ హోదాల్లో పనిచేసిన రాకేశ్ ఆస్థానాకు ఆయనకు నమ్మినబంటుగా పేరుంది. ముఖ్యంగా గోద్రా అల్లర్లు తదితర కేసుల్లో మోదీకి అనుకూలంగా వ్యవహరించారన్న ఆరోపణలను ఎదుర్కొన్నారు. 1984 బ్యాచ్ కు చెందిన ఈ ఐపీఎస్ అధికారి 2018లో సీబీఐ ప్రత్యేక డైరెక్టరుగా అప్పటి సీబీఐ డైరెక్టరు అలోక్ వర్మతో వివాదానికి దిగారు. 2016లో వడోదరలో రాకేశ్ ఆస్థానా కుమార్తె వివాహానికి హాజరైన అతిధులకు ఖరీదైన హటళ్లలో బస సమకూర్చారన్న ఆరోపణలువచ్చాయి. రాకేశ్ ఆస్థానా గతంలో బీఎస్ఎఫ్ (సరిహద్దు భద్రతా దళం) డైరెక్టర్ జనరల్ తదితర కీలక పదవులను నిర్వహించారు.

## స్వతంత్ర అభ్యర్థిగా రఘురామ



ఏలూరు, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)బయటకు ఎన్ని అనుకున్నా రెబెల్ ఎంపీ రఘురామ కృష్ణ రాజు తన రాజకీయ భవిష్యత్తు కోసం కాస్తా గట్టిగానే ప్రయత్నాలు చేసుకుంటున్నారు. ఒక వేళ అనుకున్న అంచనాలు తప్పి తన మీద అనర్హత వేటు పడితే నర్సాపురానికి ఉప ఎన్నికలు వస్తే ఏం చేయాలి అన్న దాని మీద ఆయనకు స్పష్టమైన యాక్షన్ ప్లాన్ ఉందని చెబుతున్నారు. ఉప ఎన్నికలు అనివార్యం అయితే రఘురామ కృష్ణ రాజు ఇండిపెండెంట్ గా పోటీ చేస్తారు అంటున్నారు. అలాగైతేనే ఆయనకు విపక్ష కూటమి మొత్తం నుంచి మద్దతు దక్కుతుంది అంటున్నారు. దాని కోసం ఆయన పూర్వ రంగాన్ని ఇప్పటికే సిద్ధం చేసుకుంటున్నారు అన్నది తాజా కబురుగా ఉంది. జగన్ విషయంలో రఘురామ కృష్ణ రాజు తగ్గేది లేదు అంటున్నారు. ఈ విషయంలో తాను ఎందాకైనా అని కూడా అంటున్నారు. ఆయన మీద అనర్హత వేటు వేయాలని వైసీపీ కోరుతోంది. ఈ రోజుకు కేంద్రం నుంచి మొదటి పరిష్కారం వైసీపీకి ఏంటి అంటే రఘురామ కృష్ణ రాజు ను ఇంటికి పంపించేయడమే అంటారు అంటారు. ఆ తరువాతనే విభజన హామీలు, ప్రత్యేక హోదా అయినా, మరేదైనా అని కూడా చెబుతారు. అంటే ఒక్క రఘురామ కృష్ణ రాజు కోసం మొత్తం పార్టీని, తనను కూడా ఒడ్డి మరీ అవతల వైపున బలంగా నిలబడ్డారు జగన్. అందువల్ల రాజకీయాల్లో ఏమైనా జరగవచ్చు కాబట్టి రఘురామ కృష్ణ రాజు మీద వేటు పడినా పడవచ్చు అంటున్నారు. అదే జరిగితే తొడకొట్టి మరీ జగన్ మీద గెలవాలని రాజు గారు ఆశపడుతున్నారు. రఘురామ కృష్ణ రాజు కు టీడీపీ గట్టి మద్దతుదారు అన్న సంగతి తెలిసిందే. ఇక బీజేపీతో ఆయనకు మంచి రిలేషన్స్ ఉన్నాయి. కాబట్టే ఇన్నాళ్ళుగా ఆయన మీద వేటు పడడంలేదు అంటారు. అలాగే జనసేనతో కూడా మంచి అనుబంధం ఉంది. అయితే టీడీపీ తరఫున ఆయన నిలబడితే మద్దతుకు బీజేపీ జనసేన ముందుకు రాకపోవచ్చు. దాంతో ఆయన ఇండిపెండెంట్ గానే పోటీ చేయాలనుకుంటున్నారు. అలా విపక్షాల ఉమ్మడి అభ్యర్ధిగా ఆయన బరిలో ఉండి జగన్ ఏ అభ్యర్ధిని నిలబెట్టిన ఓడించాలని చూస్తున్నారుట. ఒక విధంగా రఘురామ కృష్ణ రాజు ను ముందు పెట్టి జగన్ ని తొలిసారి ఓడించడానికి విపక్షాలు ముందస్తు అవగాహనతో ఉన్నాయని కూడా చెప్పాలిక్కడ. ఇక రఘురామ కృష్ణ రాజు మీద వేటు అని డిమాండ్ చేస్తూ వస్తున్న వైసీపీకి నర్సాపురంలో సరైన క్యాండిడేట్ ఉన్నారా అన్నదే ప్రశ్న. మాజీ ఎంపీ గంగరాజు ఫ్యామిలీని బీజేపీ నుంచి వైసీపీలోని రప్పించినా వారు ఈ ఉప ఎన్నికల్లో నిలబడతారా అన్నది కూడా చూడాలి. ఇక రఘురామ కృష్ణ రాజు కు మంచికో చెడ్డకో బాగానే పొలిటికల్ ఫోకస్ వచ్చింది. దాంతో ఆయన మీద సరైన వారే బరిలో ఉండాలి. దాంతో కాపులకు టికెట్ ఇస్తారు అన్న ప్రచారం ఉంది. మరి అలా చూసుకుంటే కొత్తపల్లి సుబ్బారాయుడు వంటి వారున్నారు. మరి ఆయన ఎంతవరకు పోటీ ఇస్తారో కూడా చూడాలి. ఇక వచ్చే ఏడాది ఉప ఎన్నిక జరుగుతుంది అంటున్నారు. అప్పటికి జగన్ సర్కార్ కి మూడేళ్ళ పాలన పూర్తి అవుతుంది. మరి అనాటికి యాంటీ ఇంకెంబెన్సీ ఏర్పడితే వైసీపీకి పొలిటికల్ గా ఇబ్బందులు స్టార్ట్ అవుతాయి. మొత్తానికి జగన్ ని విడిగా ఓడించలేమని భావిస్తున్న విపక్షాలను కలిపే వారధిగా సారధిగా ఈ ఉప ఎన్నికల ద్వారా రఘురామ కృష్ణ రాజు ముందుకు వస్తారని అంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో.

## మాట ఇక్కడ... మనసు అక్కడ

గుంటూరు, ఆగస్టు 13, (న్యూస్ పల్స్) 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున విజయం సాధించిన ఎమ్మెల్యేల్లో నలుగురు నేతలు.. పార్టీకి దూరమైన విషయం తెలిసిందే. కారణాలు ఏవైనా.. కూడా వైసీపీకి చేరువయ్యారు. నిజానికి గత ఎన్నికల్లో టీడీపీ బలమైన స్థానాలు పోగొట్టుకుంది. అలాంటిది 23 మంది ఎమ్మెల్యేలను మాత్రమే గెలిపించుకుంది. అయితే.. పట్టుమని రెండేళ్లు కూడా తిరగముందే.. టీడీపీ తరఫున విజయం దక్కించుకున్న వారిలో నలుగురు పార్టీకి దూరమయ్యారు. వీరిలో కృష్ణా జిల్లా గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, ప్రకాశం జిల్లా చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి, గుంటూరు జిల్లా గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ ఉన్నారు. అదేవిధంగా విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కూడా టీడీపీకి దూరమై.. వైసీపీకి చేరువయ్యారు. సరే.. ఇంత వరకు బాగానే ఉన్నప్పటికీ.. వచ్చే ఎన్నికల నాటికి రాష్ట్రంలో రాజకీయ సమీకరణలు మారినా.. లేక జగన్‌కు కేసులు తదితరాల నుంచి అవాంతరాలు ఏర్పడినా.. ఇప్పుడు ఆ పార్టీకి చేరువైన.. ఈ నలుగురులో ఎంత మంది వైసీపీకి అనుకూలంగా ఉంటారు ? ఎంతమంది.. మళ్లీ సైకిల్ ఎక్కేస్తారు ? అనే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఈ క్రమంలో వీరిని వ్యక్తిగతంగా తీసుకుని పరిశీలిస్తే.. వల్లభనేని వంశీ మళ్లీ టీడీపీ సైకిల్ ఎక్కే పరిస్థితి కనిపించడం లేదు. దీనికి రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి ఆయన పార్టీకి దూరమైన నేపథ్యంలో అటు చంద్రబాబును, ఇటు లోకేష్‌ను కూడా టార్గెట్ చేస్తూ.. తీవ్ర విమర్శలు చేశారు. దీంతో ఆయనను తిరిగి చేర్చుకునే అవకాశం లేదని అంటున్నారు పరిశీలకులు. అదే సమయంలో జిల్లాలోనూ మాజీ మంత్రి దేవినేని ఉమాకు.. వంశీకి అస్సలు పడదు. ఈ క్రమంలో ఇది కూడా వంశీకి అడ్డంకిగా మారనుంది. ఈ నేపథ్యంలో వంశీని తీసుకునే అవకాశం లేదు. ఇక, వాసుపల్లి గణేష్ పరిస్థితి కూడా ఇంతే. వైసీపీ నేతల ఆదేశాల మేరకు టీడీపీని టార్గెట్ చేశారు. సో.. ఈయనకు కూడా అవకాశం లేదు. పైగా గణేష్‌కు రెండు సార్లు ఛాన్స్ ఇచ్చినా పార్టీ మారి ద్రోహం చేశారని చంద్రబాబుతో పాటు స్థానిక నేతలు ఆయనపై మండిపడుతున్నారు. ఇక, మిగిలిన ఇద్దరు.. గిరి, కరణం బలరాంలను గమనిస్తే.. ఈ ఇద్దరూ కూడా వైసీపీ నేతల నుంచి ఆదేశాలు ఉన్నప్పటికీ.. చంద్రబాబును పన్నెత్తు మాట అనడం లేదు. ఇంకా ఆదిలో గిరి కొన్ని ఆరోపణలు చేసినా.. కరణం మాత్రం పన్నెత్తు మాట అనకపోగా.. ఎక్కడా టీడీపీకి వ్యతిరేకంగా ఆయన వ్యవహరించింది కూడా లేదు. ఈ ఇద్దరిలోనూ కరణం మాత్రం ఇప్పటికీ టీడీపీ వాసనలు పోకుండా.. భవిష్యత్తులో టీడీపీ అవసరం వస్తుందేమో అన్నట్టుగా రాజకీయం చేస్తున్నారని వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇటీవల ప్రకాశం జిల్లాకు చెందిన టీడీపీ ఎమ్మెల్యేలు రాయలసీమ పథకంపై ముఖ్యమంత్రికి లేఖ రాశారు. అప్పుడు అధిష్టానం నుంచి ఆయన్ను ప్రెస్‌మీట్ పెట్టి కౌంటర్ ఇవ్వమన్నా ఇవ్వలేదని వైసీపీ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయట. ఇక జిల్లాకు చెందిన మంత్రి బాలినేని సైతం తాము ఎంత చేస్తున్నా కరణం, ఆయన తనయుడు వెంకటేష్ మాత్రం పార్టీకి ఇబ్బంది వచ్చినప్పుడు పట్టించుకోవడం లేదని భావిస్తున్నారట. అందుకే రేపటి వేళ తేడాపాడాలు వస్తే కరణం మాత్రం రీ జంపింగ్ చేసే నేతల లిస్టులో ముందే ఉంటారని అంటున్నారు.

## ఉప ముఖ్యమంత్రులకు కష్టకాలమేనా

విజయవాడ, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)ఏపీలో ఉప ముఖ్యమంత్రులకు ముందుంది ముప్పు అంటున్నారు. రెండేళ్ళ క్రితం జగన్ బంపర్ మెజారిటీతో గెలిచాక ఏకంగా అయిదుగురు నేతలను ఉప ముఖ్యమంత్రులను చేశారు. సామాజిక వర్గాలు, ప్రాంతాలు అన్నీ బేరీజు వేసుకుని జగన్ చేసిన ఈ ప్రయోగం చూసి తలపండిన నేతలు కూడా నోళ్ళు వెళ్ళబెట్టారు. మరి రెండేళ్ల కాలంలో ఉప ముఖ్యమంత్రులు తమ సత్తా చాటుకున్నారా అంటే లేదు అనే జవాబు వస్తుంది. పోనీ వారు పేర్లు, శాఖలు అయినా ఏపీ జనాలకు తెలుసా అంటే అది కూడా పెద్ద డౌటే. అంటే జనాలకు అయిదురుగు ఉప ముఖ్యమంత్రులు ఎవరో గుర్తుకు రానపుడు జగన్ మార్క్ సోషల్ ఇంజనీరింగ్ నీరు కాక మరేమవుతుంది. ఒకపుడు ఉప ముఖ్యమంత్రి పదవి ఒక్కటి అంటేనే ఎంతో విలువ ఉండేది. కాంగ్రెస్ జమానాలో కోనేరు రంగారావు ఉప ముఖ్యమంత్రి అంటే ఏకంగా సీఎం అయినంతగా సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ కి దాని వల్ల రాజకీయ లాభం ఏ మేరకు వచ్చింది అన్నది పక్కన పెడితే ఫలానా వర్గానికి అలా కాంగ్రెస్ న్యాయం చేసింది అన్న మాట అయితే ఇప్పటికీ ఉంది. మరి జగన్ చేసిన ప్రయోగం వల్ల వ్రతం చెడింది, ఫలం దక్కలేదు అంటున్నారు. దాంతో వీరి పనితీరు స్వయంగా బేరీజు వేసుకున్న జగన్ చెక్ పెట్టాల్సిందే అన్న డెసిషన్ కి వచ్చేశారుట. ఏపీలో చూసుకుంటే ఉత్తరాంధ్రాలో ఇద్దరు ఉప ముఖ్యమంత్రులు ఉన్నారు. ధర్మాన కృష్ణ దాస్, పుష్ప శ్రీవాణిలకు ఈ పదవులు దక్కాయి. పశ్చిన గోదావరి నుంచి ఆళ్ళ నాని ఉంటే గుంటూరు నుంచి మేకతోటి సుచరిత ఉన్నారు. ఇక మైనారిటీ కోటాలో కడప నుంచి అంజాద్ భాషా ఉన్నారు. వీరి స్థానంలో కొత్త వారు అంటే అదే సామాజిక వర్గాలు, ప్రాంతాలు కూడా కలసి రావాలి. ఇది కష్టమేమీ కాదు, వైసీపీకి 151 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎమెల్సీలు కూడా ఇరవై మంది దాకా ఉన్నారు. దాంతో కొత్త వారిని తెచ్చి ఈ సీట్లు భర్తీకి జగన్ రెడీ అవుతున్నారుట.

అయితే ఉప ముఖ్యమంత్రులు అని పేరుకు అంటున్నా అవి అలంకారప్రాయమైన పదవులే అన్న విశ్లేషణలు నాడే వినిపించాయి. ఒకరికి ఈ పోస్ట్ ఇస్తే కచ్చితంగా ముఖ్యమంత్రి తరువాత రెండవ స్థానంలో ఉన్నారు అనేవారు. కానీ ఇంత మందికి ఇవ్వడం వల్ల ఎవరికీ రాజకీయంగా గుర్తింపు ఉండదనే అంటున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రుల శాఖల విషయంలో కూడా సరైన పనితీరు కనబరచలేదన్నది వైసీపీ హై కమాండ్ వాదన. దీని మీద కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. అన్ని శాఖలనూ జగనే సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటూంటే తమకు వెయిట్ ఏముంది అన్న బాధ వారిది. ఏది ఏమైనా కనీసం ఏపీలో తిరుగుతూ హడావుడి కూడా చేయకపోతే ఎందుకు ఈ పదవులు అన్న మాట ఉంది. అలా నోటి ధాటితో కానీ జనంతో కనెక్షన్ పెట్టుకోవడంలో కానీ చూస్తే ఈ డిప్యూటీలు పూర్ గా ఉన్నారనే వేటు వేయనున్నారుట.

## కైకలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నకిలీ ఈ చలానాలు

విజయవాడ కృష్ణాజిల్లా కైకలూరు సబ్ రిజిస్టర్ కార్యాలయంలో నకిలీ ఈ చలానా లతో సుమారుగా కోటి రూపాయల కుంభకోణం వెలుగులోకి వచ్చింది. చలానా ల దుర్వినియోగం అరికట్టేందుకు ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ చలానా కు సి ఎఫ్ ఎం ఎఫ్ కు అనుసంధానం చేసే ఈ క్రమంలో కుంభకోణం బయట పడినట్టు సమాచారం. అనుమానం వచ్చి రికార్డులను జిల్లా రిజిస్టర్ కార్యాలయంకు తీసుకుని వెళ్లి తనిఖీ చేయగా మంగళవారం సాయంత్రం వరకు సుమారుగా రూ కోటి 37 లక్షల వరకు మోసం జరిగినట్టు గుర్తించామని సిబ్బంది తెలిపారు. స్టాంప్ డ్యూటీ. రిజిస్ట్రేషన్ ఫీజు కోసం చెల్లించే చలనాలను కొందరు దుర్వినియోగం చేసినట్టు సమాచారం. రిజిస్ట్రేషన్ కోసం బ్యాంకుల్లో చలానా తీసి సబ్ రిజిస్టర్ కార్యాలయంలో సమర్పించాక కొందరు మళ్లీ దానిని వినియోగిస్తున్నారు.

మాన్యువల్ గా చలానా స్వీకరించడం, దానిని పిడిఎఫ్ గా అప్లోడ్ చేసే క్రమంలో దుర్వినియోగానికి ఆస్కారం ఉన్నట్టు పలువురు తెలుపుతున్నారు. అలాగే చలానాలు కట్టి రిజిస్ట్రేషన్ కు రాకుండా వేచి ఉంటే వారి చలానాలు దుర్వినియోగం చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తుంది. ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడిన ఈ సంఘటన పక్కదోవ పట్టించేందుకు పలువురు నేతలు ప్రయత్నిస్తున్నట్టు సమాచారం. ఈ సంఘటనపై సబ్ రిజిస్ట్రార్ కె.వి వి ఎస్ ఎస్ ఎన్ సుబ్రహ్మణ్యంను వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ కుంభకోణం బయటపడ్డ విషయం నిజమేనని నిర్ధారించారు. జిల్లా రిజిస్టర్ కార్యాలయంకు రికార్డు పంపగా అక్కడ విచారణ జరుగుతుందని ఎంత మొత్తం అనేది త్వరలో బయటపడుతుందని అన్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్లో కంప్లైంటు ఇచ్చామని తెలిపారు

## పవన్ ఆచితూచి అడుగులు

విజయవాడ, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)జనసేన అధినేత పవన్ కల్యాణ్ వచ్చే ఎన్నికలకు సమయాత్తమవుతున్నారు. ప్రస్తుతానికి బీజేపీతో కలసి ఉన్నా రానున్న రోజుల్లో సమీకరణాలు మారే అవకాశం ఉంది. అయితే గతంలో ఉన్న క్రేజ్ ఇప్పుడు పవన్ కల్యాణ్ కు ఉందా? అంటే డౌటే అన్న సమాధానం వస్తుంది. గత ఎన్నికల్లో రెండు చోట్ల ఓటమి పాలయిన పవన్ కల్యాణ్ ఈసారి ఎక్కడ నుంచి పోటీ చేసినా అంతటి క్రేజ్ రాదన్నది విశ్లేషకుల అంచనా. 2014లో పోటీ చేయకుండా బీజేపీ, టీడీపీ కూటమికి పవన్ కల్యాణ్ మద్దతు ఇచ్చారు. బీజేపీ, జనసేన కూటమి అధికారంలోకి రావడంతో పవన్ కల్యాణ్ ప్రభావం కూడా ఈ విజయం వెనక ఉందని అందరూ భావించారు. కానీ 2019 ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసిన పవన్ కల్యాణ్ కు ఎక్కడా విజయం దక్కలేదు. కేవలం ఒక్క స్థానంతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కనీసం సొంత సామాజికవర్గం ఓటర్లు కూడా పవన్ కల్యాణ్ కు దన్నుగా నిలవలేదు. జనసేన ఏడేళ్ల క్రితానికి ఇప్పటికీ పెద్దగా బలోపేతం అయింది లేదు. పైగా పవన్ కల్యాణ్ ప్రజా సమస్యలపై పోరాడింది లేదు. పార్ట్ టైం పొలిటీషియన్ గానే పవన్ కల్యాణ్ ను ప్రజలు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లోనూ పవన్ కల్యాణ్ కు ఆయన అభిమానులతో పాటు సొంత సామాజికవర్గం నేతలు అండగా నిలుస్తారన్న గ్యారంటీ లేదు. క్షేత్రస్థాయిలో పవన్ కల్యాణ్ ఇప్పటికీ నాయకత్వాన్ని బలపర్చే ప్రయత్నం చేయడం లేదు. ఇక వచ్చే ఎన్నికల్లో పవన్ కల్యాణ్ బీజేపీతో కలసి పోటీ చేస్తే మళ్లీ రిజల్ట్ రిపీట్ అయ్యే అవకాశాలే ఎక్కువగా కన్పిస్తున్నాయి. కనీస పనితీరును ఏ ఎన్నికల్లోనూ జనసేన కనపర్చకపోవడంతో క్యాడర్ కూడా నిరాశలో ఉంది. తెలుగుదేశం పార్టీతో కలిస్తేనే పవన్ కల్యాణ్ పార్టీకి కొంత భవిష్యత్ ఉందన్న సూచనలు అందుతున్నాయి. మొత్తం మీద గతంలో పవన్ కల్యాణ్ కు ఉన్న క్రేజ్ వచ్చే ఎన్నికల్లో మాత్రం ఉండదన్నది వాస్తవం.



## ఫీల్డులో జగన్ కు మంచి మార్కులే

కడప, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)ఆంధ్రప్రదేశ్ లో జగన్ వ్యూహం సత్ఫలితాలనిస్తుందనే చెప్పాలి. రెండేళ్ల పాలనలో వరసగా జరుగుతున్న ఎన్నికలు వన్ సైడ్ ఫలితాలను తెచ్చిపెడుతుండటం జగన్ పనితీరుకు అద్దం పడుతుంది. ప్రధానంగా సంక్షేమ పథకాలు జగన్ అమలు చేస్తున్న తీరు పట్ల ప్రజలు సంతృప్తికరంగా ఉన్నారన్నది ఈ ఫలితాలను బట్టి స్పష్టమవుతుంది. ఎన్ని కష్టాలొచ్చినా జగన్ పథకాలను ఆపకపోవడమే ప్రజల్లో విశ్వాసం పెరిగిందనడానికి ఇది ఉదాహరణగా చెప్పుకోవాల్సిందే. కరోనా కష్టకాలంలోనూ జగన్ పథకాలను నిలుపుదల చేయలేదు. ఈరెండేళ్ల కాలంలో దాదాపు లక్ష కోట్లను ప్రజల ఖాతాల్లోకి జమ చేశారు. వివిధ పథకాల కింద ప్రతి నెలా ఏదో ఒక పథకం కింద నిధులను జమ చేస్తూ వస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతితో పాటు రైతులు కూడా జగన్ పట్ల సానుకూల ధోరణని కనపరుస్తున్నాయి. ఈ రెండేళ్లలో అనేక ఎన్నికలు జరిగాయి. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైసీపీ క్లీన్ స్వీప్ చేసింది. తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లోనూ అదే తీరును జగన్ పార్టీ కనపర్చింది. ఇక త్వరలో జరగబోయే బద్వేలు ఉప ఎన్నికలోనూ ఇదే పరిస్థితి ఉంటుందని చెప్పక తప్పదు. ప్రజల సొమ్మును జగన్ పప్పు బెల్లాలుగా పంచిపెడుతున్నారన్న విపక్షాల విమర్శలను కూడా ప్రజలు పట్టించుకోవడం లేదని ఈ ఫలితాల ద్వారా వెల్లడవుతుంది. ఏలూరు కార్పొరేషన్ ఎన్నికల్లో సయితం జగన్ పార్టీ ఏకపక్షంగా విజయం నమోదు చేయడంతో విపక్షాలు కూడా పునరాలోచనలో పడ్డాయి. ప్రతి నెలా ఒకటోతేదీ నాడే ఎన్ని అవరోధాలున్నా పింఛను ను ఇంటికే పంపిణీ చేయడం కూడా జగన్ కు అడ్వాంటేజీగా మారింది. అభివృద్ధి పెద్దగా లేకపోయినా ప్రజలు పట్టించుకోవడం లేదు. దీంతో పాటు కొన్నింటిపై న్యాయస్థానాలను ఆశ్రయించి జగన్ ప్రభుత్వానికి అడ్డంకులు కల్పించడం కూడా వైసీపీకే ప్లస్ గా మారింది. మొత్తం మీద జగన్ ఇదే రీతిన పాలనను కొనసాగిస్తే వచ్చే ఎన్నికల్లో కూడా సేమ్ ఫలితాలు రిపీట్ అయ్యే అవకాశముందన్నది విశ్లేషకుల అంచనా. ప్రత్యేక హోదా, పోలవరం, విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ వంటివి అప్రధాన అంశాలుగా ప్రజలు చూస్తున్నారని చెప్పక తప్పదు.

## పల్లెల్లో విద్యుత్ భారం

శ్రీకాకుళం, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)ఇప్పటికే విద్యుత్ ఛార్జీల భారంతో అల్లాడు తున్న ప్రజలపై ప్రయివేటు సరఫరాతో మరో భారం పడనుంది. తాజాగా నీతీఅయోగ్ చేసిన సిఫార్సులు, సూచనలు అమలులోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో జనంపై అదనపు భారం తప్పదు. వీటిపై రాష్ట్రాల ప్రభుత్వాలు కూడా ఆలోచన చేయాలని నీతి ఆయోగ్ సూచించడం గమనార్హం. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వల్ల ఆర్థికంగా భారం పెరుగుతున్నట్లు తాజాగా నీతి ఆయోగ్ విడుదల చేసిన నివేదికలో పేర్కొంది. విద్యుత్ సరఫరాలో నష్టాలు ఉన్న ప్రాంతాల్లో, వాణిజ్య వ్యవహారాలు సజావుగా ఉండని ప్రారతాల్లో పరిస్థితిని నివేదికలో ప్రస్తావించింది. ప్రధానంగా వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ సహకారం లేకుండా నష్టాలను పూడ్చుకోలేని ప్రాంతాలపైనే దృష్టి సారించింది. ఇటువంటి నష్టాలు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లోనే ఉన్నాయని పేర్కొంది. అందువల్లనే ఈ ప్రాంతాల్లో ప్రయివేటు సంస్థల సాయం తీసుకోవాలన్న భావాన్ని వ్యక్తం చేసింది. ప్రజలకు విద్యుత్ సరఫరా చేయడంతోపాటు నష్టాన్ని తగ్గించుకునేందుకు ప్రయివేటు సంస్థల నుంచి బిడ్లు ఆహ్వానిస్తే మంచిదని నీతీఅయోగ్ సిఫార్సు చేసింది. నేరుగా నగదు బదిలీ ద్వారా ఆదాయంలో లీకేజిలను అధిగమించడం సాధ్యమన్న భావాన్ని వ్యక్తం చేసిన నీతీఅయోగ్ ప్రయివేటుకు మొగ్గు చూపిస్తూనే సబ్సిడీలపైనా వ్యతిరేక భావాన్ని వ్యక్తం చేసింది. అనేక రాష్ట్రాలు వ్యవసాయ రంగానికి సబ్సిడీలు ఇస్తూనే కొన్ని చోట్ల ఉచిత విద్యుత్ కూడా ఇస్తున్నాయని నీతీ అయోగ్ గుర్తు చేసింది. ఇవి ఉత్పత్తి, సరఫరాలో లీకేజిలు పెరగడానికి కారణమవుతున్నాయని, అధిక స్థాయిలో డిస్కామ్‌లు నష్టపోవడానికి కూడా కారణమవుతున్నాయని అభిప్రాయపడింది. అయితే రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, కర్నాటక, మహారాష్ట్ర, గుజరాత్ వంటి రాష్ట్రాలు వ్యవసాయ, వ్యవసాయేతర రంగాలకు ఫీడర్లను సెపరేట్ చేయడం ద్వారా కొంతవరకు నష్టాలను తగ్గించు కోగలిగాయని పేర్కొంది. అలాగే వ్యవసాయానికి సోలార్ పంపులను ఉపయోగించడం ద్వారా డిస్కామ్‌లు కొరత విద్యుత్ కొనుగోలు వ్యయాన్ని తగ్గించుకోగలిగాయని పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రయివేటు సేవలను ఉపయోగించుకోవాలని అన్యాపదేశంగా సూచించింది. దాంతో అటు వ్యవసాయానికి, గ్రామీణ ప్రాంతాలకు ఇప్పుడందుతున్న ఉచిత లేదా చౌక విద్యుత్ ఇకపై ఉండదన్నమాట.

# భారీగా పెరిగిన బీటి పత్తి

గుంటూరు, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)అనుమతుల్లేని బిటి-3 పత్తి సాగు ఈ ఏడాది అధికమైంది. ఎక్కువగా పత్తి సాగయ్యే మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గతేడాది కంటే సాగు రెట్టింపైనట్లు చెబుతున్నారు. నిరుడు ఆయా రాష్ట్రాల్లో 30 లక్షల ప్యాకెట్ల వరకు విక్రయించగా ప్రస్తుత ఖరీఫ్‌లో 75 లక్షల ప్యాకెట్లకు అమ్మకాలు చేరుకున్నాయని అంచనా. మహారాష్ట్ర, తెలంగాణ, ఎపిలలో ఈ ఖరీఫ్‌లో రూ.300 కోట్ల చట్ట విరుద్ధ చీకటి వ్యాపారం జరిగిందని సమాచారం. ఎపిలో ఇప్పటి వరకు సాగైన పత్తిలో లక్షన్నర నుండి రెండు లక్షల ఎకరాల వరకు అనధికారిక రకం పత్తి ఉంటుందని సమాచారం. అనుమతుల్లేని బిటి-3 వేరియంట్ సాగు వలన పర్యావరణానికి, రైతులకు, చట్టబద్ధ పత్తి విత్తన మార్కెట్‌కు, స్థానిక చిన్న కంపెనీలకు, చివరికి ప్రభుత్వ పన్ను ఆదాయానికి నష్టమని సీడ్ కంపెనీల అసోసియేషన్స్, పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చర్యలు తీసుకోవాలని దఫదఫాలుగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేశారు. కాగా మూడు వ్యవసాయ చట్టాలు చేసే విషయంలో రాష్ట్రాల హక్కులను ఏ మాత్రం పరిగణనలోకి తీసుకోని కేంద్రం, అంతర్రాష్ట్ర సమస్యగా మారిన అనుమతుల్లేని విత్తన విక్రయాలపై చర్యలు తీసుకొనే విషయంలో మాత్రం కట్టడి బాధ్యత రాష్ట్రాలదేనని తప్పించుకుంది.బోల్‌గార్డ్ 3/ హెర్బిసైడ్ టాలరెంట్ (హెచ్‌టి)/ గ్లెయిసెల్/ రౌండప్ రెడీ ఫ్లెక్స్ (ఆర్‌ఆర్‌ఎఫ్)/ బిటి-3... పేరేదైనా ఈ రకం పత్తి విత్తనాలకు జెనెటిక్ ఇంజనీరింగ్ అప్రూవల్ కమిటీ (జిఇఎసి) అనుమతుల్లేవు. అయినప్పటికీ 2016 నుండి దేశంలో హెచ్‌టి పేరుతో అక్కడక్కడ అనధికారిక సాగు మొదలైంది. 2017లో పార్లమెంట్‌లో లేవనెత్తిన మీదట ప్రధాన మంత్రి కార్యాలయం (పిఎంఒ) ఆదేశాల మేరకు బయో టెక్నాలజీ డిపార్టుమెంట్ ఆధ్వర్యంలో ఫీల్డ్ ఇన్‌స్పెక్షన్ అండ్ సైంటిఫిక్ ఎవాల్యూషన్ కమిటీ (ఎఫ్ఐఎస్ఇసి), మహారాష్ట్ర, గుజరాత్, తెలంగాణ, ఎపిలలో కొన్ని వేల నమూనాలు పరీక్షించిన మీదట 15 శాతం విస్తీర్ణంలో హెచ్‌టి రకం సాగైందని తేల్చింది. అప్పటి నుండి అనధికారిక సాగు క్రమేపి పెరుగుతూ వస్తోంది.జన్యుపరంగా మార్పిడి చేసిన పత్తి విత్తనాల్లో ఇప్పటి వరకు బోల్‌గార్డ్1, బోల్‌గార్డ్2 రకాలకు జిఇఎసి అనుమతులున్నాయి. ఈ టెక్నాలజీని మోన్ శాంటో తీసుకొచ్చింది. పత్తిని ఆశించే శనగపచ్చ పురు గును మాత్రమే ఈ రకాలు నిరోధిస్తాయంటున్నారు. బిటి-3 వేరియంట్ మొక్కలు కలుపు మొక్కలు పెరగకుండా స్ప్రే చేసే గ్లయిఫోసేట్ హెర్బిసైడ్‌ను తట్టుకుంటాయంటున్నారు. అనుమతుల్లేకపోయినా ఐదారేళ్ల నుండి రైతుల పొలాల్లో సాగవుతున్నాయి. బిటి-3 విత్తనాలు వేస్తే రైతులకు ఎకరానికి రూ.7 వేల నుండి 8 వేల వరకు కలుపు తీత ఖర్చు తగ్గుతుందని ప్రచారం చేస్తున్నారు. చాలా మట్టుకు గుజరాత్ నుండి మహారాష్ట్ర మీదుగా తెలంగాణ, ఎపిలకు విత్తనాలు రహస్యంగా వచ్చి పడుతున్నాయి. గుంటూరు జిల్లా అమరావతి మండలం గతంలో బిటి-3కి కేంద్రంగా కొనసాగింది. పలు విధాలుగా నష్టపరిచే ప్రమాదకర పత్తి విత్తనాల కట్టడి విషయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అచేతనంగా వ్యవహరిస్తున్నాయని, బాధ్యత మీదంటే మీదని చేతులెస్తున్నాయని ఆరోపణలొస్తున్నాయి.

# ఎమ్మెల్యే గారు మా పంటలను కాపాడండి...

నందికొట్కూర్ ఆగస్టు 13, (న్యూస్ పల్స్)నందికొట్కూరు నియోజకవర్గం లోని మొక్కజొన్న పంట వేసుకున్న రైతులు వేడుకుంటున్నారని. రైతు సంఘం జిల్లా నాయకులు రాజు ఈ సందర్భంగా నందికొట్కూరు నియోజకవర్గంలో ఎత్తిపోతల పథకాలు ఉన్నప్పటికీ కొంత మంది రైతులకు ప్రయోజనం. మరి కొందరు రైతులకి అన్యాయం జరుగుతుందని రైతు సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ వచ్చిన మరో వెంటనే మల్యాల ఎత్తిపోతల పథకం ద్వారా అనంతపురం జిల్లాకు నీటి నీటిని విడుదల చేయడం జరిగింది. మరుక్షణమే తాటిపాడు ఎత్తిపోతల పథకం ద్వారా రైతులకు వీటిని విడుదల చేసి వారి పంటలను కాపాడడం జరిగింది. ముఖ్యంగా చెప్పాలంటే గతంలో ఉన్నటువంటి ప్రభుత్వాలు రైతుల సాధక బాధలను గుర్తించి. ఎత్తిపోతల పథకలను ప్రారంభించడం జరిగిందన్నారు. శ్రీశైలం బ్యాక్ వాటర్ వచ్చిన మరో వెంటనే తాటిపాడు ఎత్తిపోతల పథం ద్వారా రైతుల పంటలు ఎండిపోకుండా అక్కడ ఉన్న రైతు కమిటీ సభ్యులు నీటిని విడుదల చేయించడం జరిగింది. ఇప్పుడు వర్షం లేక 20 రోజులు వస్తుంది. ముందుగా పంటలు వేసుకున్న రైతులు అధిక వర్షాలతో నష్టపోవడం జరిగింది. రెండవసారి పంటలు వేసుకున్న లక్ష్మాపురం. పగిద్యాల. కొణిదేల. బిజినవేముల. నందికొట్కూర్. మండ్లేం. తర్తూర్. రైతులు వర్షం లేక మొక్క జొన్నలు ఎండిపోవడం జరుగుతుంది. నాగటూర్ ఎత్తిపోతల పథకం ద్వారా వీటిని విడుదల చేస్తే పంటలను కాపాడుకోవచ్చని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చెప్పాలంటే నాగటూరు ఎత్తి పోతల పథకం విడుదల చేయకుండా కొన్ని కారణాల వల్ల లిఫ్ట్ ను మధ్యపెట్టి కరెంటు పేరుతో కరెంటు డీపులు చెడిపోవడం జరిగిందని. రైతుల పంటలను ఎండబెట్టడం ఎంత వరకు సమంజసమని రైతు సంఘం నాయకులు కోరుతున్నారు. రైతు కమిటీ సభ్యులు కొట్లడుకోవడం తప్పా రైతుల బాధలను గుర్తించడం లేదన్నారు. ఎత్తిపోతల పథకం నీటిని విడుదల చేసి తమను కాపాడాలని అధికారులు నాయకులు గుర్తించడం లేదని మన నందికొట్కూరు శాసనసభ్యులు ఆర్థర్. తాటిపాడు. సేలిమిల్ల. సంగమేశ్వర ఎత్తిపోతల పథకలను ప్రారంభించడం జరిగిందని. ముఖ్యంగా చెప్పాలంటే మన ఎమ్మెల్యే గారికి నాగటూరు ఎత్తిపోతల పథకం గుర్తుకు రావడం జరిగిందో. లేదో కానీ ఇప్పటికైనా ఒకసారి రైతన్నల బాధలను గుర్తించి నందికొట్కూర్ వైయస్ఆర్సిపి ఇన్చార్జ్ బైరెడ్డి సిద్ధార్థ రెడ్డి. నందికొట్కూర్ శాసనసభ్యులు ఆర్థర్. నాగటూర్ పోతల పథకం ద్వారా నీటిని విడుదల చేస్తారని రైతన్నలు రైతు కమిటీ సభ్యులు అభిప్రాయపడుతున్నారని ఏపీ జిల్లా రైతు సంగం కమిటీ సభ్యులు బెస్త రాజు కోరారు.

# చంద్రగిరి ప్రజలకు ఎమ్మెల్యే చెవిరెడ్డి ఆరోగ్య భరోసా

## మరోమారు ఇంటింటికి ఆనందయ్య మందు పంపిణీకి శ్రీకారం

తిరుపతి, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)థర్డ్ వేవ్ కరోనా నుంచి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించేందుకు మరోమారు 1.60 కుటుంబాలకు ఆనందయ్య మందు పంపిణీకి ఎమ్మెల్యే డాక్టర్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. నియోజకవర్గ ప్రజల ఆరోగ్య పరిరక్షణే లక్ష్యంగా నడుంబిగించారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం ఎంపిడిఓ కార్యాలయం కేంద్రంగా ఆనందయ్య మందు పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ.. గడిచిన కరోనా వేవ్ పరిస్థితుల కన్నా అత్యంత ప్రమాదకరంగా థర్డ్ వేవ్ ముంచుకొస్తోందన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు నా వంతు బాధ్యతగా కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. వాలంటరీ ద్వారా ప్రతి ఇంటికి ఆనందయ్య మందు పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు. నిరంతరంగా ఫీవర్ సర్వే పక్కాగా నిర్వహించేలా చర్యలు చేపట్టినట్లు తెలియజేశారు. కరోనా నిబంధనలు తప్పక అనుసరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అంతే కాకుండా చంద్రగిరి ప్రజల అవసరాల కోసం అత్యాధునిక పరికరాలతో కూడిన అంబులెన్స్ ను అందుబాటులోకి తీసుకొచ్చినట్టు వెల్లడించారు. గతంలో కూడా కరోనా కాలంలో ప్రజలకు అండగా నిలిచామని అందుకు మాస్క్ లు, సానిటైజర్లు, పండ్లు, కూరగాయలు, కోడి గుడ్లు, నిత్యావసర సరుకులు, విటమిన్ టాబ్లెట్ లు, సిరప్ లు తదితరాలు అందించినట్లు వెల్లడించారు. నా ప్రజల కోసం నా వంతు బాధ్యతగా ఎంత కష్టమైనా, ఎంత ఖర్చయినా బెనకాడబోనని వెల్లడించారు. నా ప్రజల కోసం అన్ని రకాలుగా సిద్దంగా ఉన్నానని తెలియజేశారు.

# జంపింగ్ జపాంగ్ లు ఎటూ కాకుండా పోతున్నారే

తిరుపతి, ఆగస్టు 13, (న్యూస్ పల్స్)రాజకీయాలలో ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారడం .. ఒక గుర్తుపై గెలిచి మరో గుర్త పార్టీని అంటిపెట్టుకోవడం కామన్‌గా మారిపోయింది. అవకాశం.. అవసరం.. రెండు కారణంగా.. నాయకులు ఇలాంటి జంపింగులకు అలవాటు పడిన నేపథ్యంలో ప్రజలు కూడా లైట్ తీసుకుంటున్నారు. మన తెలుగు రాజకీయాల్లో 24 గంటల్లో మూడు ప్రాధాన పార్టీలు మారి ఈ రోజు ఎమ్మెల్యేలు అయిన నేతలు కూడా ఉన్నారు. ఇలా.. 2017-19 మధ్య కాలంలో వైసీపీ నుంచి జంప్ చేసిన నేతలు.. చాలా మంది టీడీపీలో చేరారు. గత ఎన్నికల్లో వీరంతా దాదాపు టికెట్లు తెచ్చుకుని పోటీ చేశారు. అయితే.. వైసీపీ సునామీ కారణంగా ఓడిపోయారు. ఇక, అప్పటి నుంచి పార్టీలో గుర్తింపు లేకుండా పోయిందనే ఆవేదన వీరిలో కనిపిస్తోంది.టీడీపీలో కీలక పదవుల విషయంలో జంపింగులకు చంద్రబాబు అవకాశం ఇవ్వలేదు. పార్టీలో నియామకాలు చేపట్టినా జంపింగు నేతలకు.. ముఖ్యంగా గిరిజన, ఎస్సీ ప్రాంతాల్లోని వారికి కూడా ప్రాధాన్యం లేకుండా చేశారు. దీంతో జంపింగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొట్టిపాటి రవికుమార్ లాంటి నేతలు ఓటమి లేకుండా వరుసగా విజయాలు సాధిస్తూ వస్తున్నారు. గత ఎన్నికల్లో పార్టీలోకి వచ్చిన జంపింగ్‌లు అందరూ ఓడిపోయినా రవి మాత్రం గెలిచారు. అలాంటి నేతకు ఏ పీఏసీ పదవి ఇవ్వడమో లేదా ఇతర కీలక పదవులు కట్టబెట్టడమో చేయాల్సి ఉన్నా చేయలేదని ఆయన వర్గం వాపోతోంది.ఇక ఇప్పటికే టీడీపీలో స్థిరపడిన నాయకులు ఎవరూ కూడా వీరిని పట్టించుకోవడం లేదు. దీంతో ఉండాలా ? వద్దా ? అనే మీమాంసలో నాయకులు నలిగిపోతున్నారనేది వాస్తవం. కానీ, ఇప్పటికిప్పుడు ఎటూ నిర్ణయం తీసుకోలేని వారు కూడా ఉన్నారు. అరకు, బొబ్బిలి, రంపచోడవరం, పాడేరు, పామర్రు, విజయవాడ వెస్ట్.. ఇలా అనేక నియోజకవర్గాల్లో నాయకుల పరిస్థితి ఇలానే ఉంది. బొబ్బిలిలో మాజీ మంత్రి సుజయ్ కృష్ణ, పలమనేరులో మరో మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి కూడా రాజకీయ భవిష్యత్తు కోసం సరైన నిర్ణయకోసమే వెయిటింగ్‌లో ఉన్నట్టు తెలుస్తోంది.సీమలోని కొన్ని జిల్లాల్లో మాత్రం జంపింగులు మళ్లీ.. వైసీపీలోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

వారు స్థానికంగా ఉన్న నేతలను మచ్చిక చేసుకుంటున్నారు. ఎందుకంటే.. గత ఎన్నికల్లో సీమలో టీడీపీ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయింది. కీలక నియోజకవర్గాల్లో కూడా పార్టీ గెలుపు గుర్రం ఎక్కలేదు. ఇక, ఇప్పుడు కూడా టీడీపీ పుంజుకునే పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంది. దీంతో ఈ నాలుగు జిల్లాల్లో నేతలు.. చాలా మంది పార్టీ మారిపోయి.. వైసీపీ గూటికి చేరుకుంటే..ఏదో ఒక నామినేటెడ్ పదవైనా.. దక్కుతుందని అనుకుంటున్నారు. కానీ, ఇప్పటికిప్పుడు మాత్రం ఆ పరిస్థితి ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. దీంతో వైసీపీని వదిలేసి తప్పుచేశాం.. ఇప్పుడు వెళ్లలేక అవస్థలు పడుతున్నాం.. అనే మాట జోరుగా వినిపిస్తుండడం గమనార్హం.

# టీటీడీ చైర్మన్ వై.వీ సుబ్బారెడ్డి కి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి మేకపాటి

తిరుపతి, ఆగస్ట్, 13 పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డి టీటీడీ ఛైర్మన్ వై.వీ సుబ్బారెడ్డితో సమావేశమయ్యారు. శుక్రవారం ఉదయం తిరుపతిలోని టీటీడీ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కార్యాలయంలో వై.వీ సుబ్బారెడ్డితో ఆయన సమావేశమయ్యారు. రెండోసారి టీటీడీ ఛైర్మన్ గా బాధ్యతలు తీసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ పూలగుచ్ఛం అందజేసి మంత్రి గౌతమ్ రెడ్డి శుభాభినందనలు తెలిపారు. రెండు సార్లు టీటీడీ ఛైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన జాబితాలో వై.వీ సుబ్బారెడ్డి నాలుగో స్థానంలో ఉండడం ఆయన అంకితభావానికి నిదర్శనమని మంత్రి గౌతమ్ రెడ్డి కొనియాడారు. మంత్రి మేకపాటి గౌతమ్ రెడ్డితో పాటు పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి కూడా హాజరై టీటీడీ ఛైర్మన్ కి శుభాకాంక్షలు తెలిపారు.

# బీజేపీ నేతపై దాడి?తీవ్రగాయాలు

గుంటూరు ఆగస్టు 13, (న్యూస్ పల్స్)గుంటూరు జిల్లా వినుకొండలో బీజేపీ నేతపై దాడి జరిగింది. : భారతీయ జనతా పార్టీ పట్టణ అధ్యక్షుడు మేడం రమేష్ పై గుర్తు తెలియని ఆగంతకులు దాడి చేసి తీవ్రంగా గాయపరచారు. ఘటన పట్టణంలోని ఏనుగు పాలెం రోడ్డు లో శుక్రవారం ఉదయం జరిగింది. ఇంటి నుండి బయటకు వస్తుండగా గుర్తుతెలియని వ్యక్తులు మొహానికి మాస్కులు ధరించి కర్రలతో దాడి చేశారని బాధిత రమేష్ వాపోయాడు. సురేష్ మహల్ రోడ్ లోని శివాలయం కూల్చివేసిన విషయంలో కమిషనర్ ని బాధ్యులు చేస్తూ ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేయడంతో తనపై కక్ష కట్టి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు గుర్తుతెలియని వ్యక్తులతో దాడి చేయించాడని బాధితుడు రమేష్ ఆరోపిస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

# సబ్ కలెక్టర్ ను నియమించాలి

## కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా

కోరుట్ల ఆగస్టు 13, (న్యూస్ పల్స్)మెట్ పల్లిలో గత కొన్ని రోజులుగా ఖాళీగా ఉంటున్న సబ్ కలెక్టర్ పోస్టును వెంటనే నియామకం చేయాలని కాంగ్రెస్ పార్టీ మెట్ పల్లి పట్టణ అధ్యక్షుడు మహ్మద్ ఖుతుబొద్దిన్ పాషా అన్నారు. శుక్రవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. డివిజన్ కేంద్రం అభివృద్ధికి కీలకంగా వ్యవహరించే సబ్ కలెక్టర్ పోస్టు గత కొన్ని రోజులుగా ఖాళీగా ఉండడంతో పాలన సజావుగా సాగడం లేదన్న ప్రజల్లో ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ప్రజలు కొన్ని సమస్యలు సబ్ కలెక్టర్ వారికి నేరుగా విన్నవించుకుందామంటే వారు లేకపోవడంతో ప్రజలు నిరాశతో ఉంటున్నారన్నారు. సంబంధిత ప్రజాప్రతినిధులు స్పందించి మెట్ పల్లి కేంద్రానికి వెంటనే సబ్ కలెక్టర్ ను నియామకం చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

# టీడీపీ ధర్నా

విజయనగరంఆగస్టు 13, (న్యూస్ పల్స్)శుక్రవారం నాడు తెలుగుయువత ఆధ్వర్యంలో ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద యువతకు ఉద్యోగాలు కల్పించాలని కోరుతూ నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి పార్టీ విద్యార్థి విభాగం మద్దతు ఇచ్చింది. ఈ సందర్భంగా తెలుగుయువత పార్లమెంటు అధ్యక్షులు వేమలి చైతన్య బాబు మాట్లాడుతూ ఈ రోజు ప్రపంచ వ్యాప్తంగా యువత ఆనందంగా అంతర్జాతీయ యువజన దినోత్సవం నిర్వహించుకుంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం యువత జగన్ మోహన్ రెడ్డి చేసిన మోసానికి బాధతో, ఆవేదనతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని అన్నారు. పాదయాత్ర సమయంలో 2.30 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన జగన్ మోహన్ రెడ్డి మోసం చేస్తూ రెండేళ్ల తరువాత కేవలం 10,143 ప్రభుత్వ ఉద్యోగాలు మాత్రమే భర్తీ చేస్తానని అనడం దారుణమని అన్నారు. ఇంకోవైపు ప్రయివేట్ పరిశ్రమలు తీస్కునిరాకపోగా , ఉన్న వాటిని తరిమేయడం మూలంగా 2019 లో 3.6% మాత్రమే ఉన్న నిరుద్యోగ రేటు 2021 మే నెలకు 13.5% కి పెరిగిందని, ఇలానే కొనసాగితే రాష్ట్రంలో నిరుద్యోగం కారణంగా దోపిడీలు, దొంగతనాలు పెరుగుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. నిరుద్యోగులు ఎటువంటి పోరాటానికి పిలుపునిచ్చినా నారాలోకేష్ గారు, రాష్ట్ర తెలుగుయువత అధ్యక్షులు శ్రీరామ్ చినబాబు గారి ఆధ్వర్యంలో తెలుగుయువత మద్దతు ఇస్తుందని అన్నారు.ప్రధాన కార్యదర్శి గొలగాని సురేంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలో ఆత్మహత్యలు పెరిగాయని, కరోనాతో అయినా బ్రతకగలం కానీ ఈ జగన్ పాలనలో మాత్రం బ్రతకలేం అని యువత అనుకుంటున్నారని యువతను ఆదుకోవాలని అన్నారు. తెలుగుయువత కార్యక్రమానికి మద్దతుగా పాల్గొన్న టీఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షులు పతివాడ తారక్ రామానాయుడు మాట్లాడుతూ నిరుద్యోగులకు అండగా గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన నిరుద్యోగ భృతి తీసివేయడం, ఇంకో వైపు ప్రయివేటు ఉద్యోగాలు కూడా లేకపోవడం వలన యువత ఇబ్బందులు పడుతున్నారని, ఇప్పటికైనా యువత ఆవేదన అర్ధం చేసుకోవాలని అన్నారు. విద్యార్థులు , యువత ఏ పోరాటం చేసినా టీఎన్ఎస్ఎఫ్ , తెలుగుయువత తరపున అండగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగుయువత నాయకులు కొట్యాడ శ్రీను, పిన్నింటి కిషోర్, పెదిరెడ్ల సతీష్, చిప్పాడ స్వామి, ౦౦ రాజు, మద్దిల ప్రవీణ్, రేవల్ల సతీష్ , జామి గణేష్, కోరాడ రామకృష్ణ, కుటుంబరావు, కోట బాలకృష్ణ, కుమిలి ప్రసాద్, ఖఐఒ రాజు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

# హిందూ దేవాలయాల విషయంలో వైసీపి ప్రభుత్వం పారదర్శకత ప్రదర్శించాలి

## బిజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

తిరుమలఆగస్టు 13, (న్యూస్ పల్స్) హిందూ దేవాలయాల విషయంలో విషయంలో ఒకలా, అన్యమతస్తుల విషయంలో మరోలా వైసీపి ప్రభుత్వం వ్యవహరించడం సరైన విధానం బిజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి మండిపడ్డారు..ఇవాళ ఉదయం వి.ఐ.పివిరామ సమయంలో స్వామి వారి సేవలో పాల్గోని మొక్కులు చెల్లించుకున్నారు..అనంతరం ఆలయ వెలుపలకు వచ్చిన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పారదర్శకమైన పాలన అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు..ఏపిలో వైసీపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హిందూ ధార్మిక క్షేత్రాలకు సంబంధించిన విషయంలో ఒకరకమైన అభిప్రాయం,అన్యమతాలకు సంబంధించిన విషయంలో భిన్న కోణంలో వైసీపి ప్రభుత్వం చూస్తుందని ఇవాళ కోట్ల మంది హిందువుల అభిప్రాయమని ఆయన అన్నారు..ఏపిలో గతంలో ఉన్న ప్రభుత్వాలు, ప్రస్తుతం ఉన్న ప్రభుత్వం హిందూ దేవాలయాల్లో భక్తుల కానులు సమర్పించే వాడిలో 21 శాతం ట్యాక్స్ రూపంలో తీసుకుంటుందన్నారు..దేవాదాయశాఖ అడ్మినిస్ట్రేషన్ ఫండ్ అని చెప్పి 8 శాతం,సిజిఎఫ్ అని చెప్పి 9శాతం,అర్చక వెల్ఫేర్ ఫండ్ క్రింద మూడు శాతం,ఆడిట్ పేరు మీద 1.5 శాతం తీసుకుటుందని, దేవాలయాల్లో భక్తుల సమర్పించిన కానుకలను వివిధ ట్యాక్స్ రూపాల్లో ప్రభుత్వం తీసుకోవడం అన్యాయంమని ఆయన ఆవేదన వ్యక్తం చేసారు..హిందూ దేవాలయాలల్లో కానుకల నుంచి తీసుకున్న నగదు హిందూ దేవాలయాలకు సంబంధించిన అర్చకులకు,సిబ్బంది,దేవాదాయశాఖ వారి డబ్బులు ఇస్తున్నారని,దర్గాలకు,మసీదులకు,చర్చులకు వచ్చే డబ్బును ఎందుకు తీసుకోవడం లేదని ఆయన ప్రశ్నించారు..వేల కోట్ల రూపాయల ఆస్తులు ఉన్న చర్చలకు సంబంధిన కమిటీలు కొట్టుకుంటున్నారని,హిందూ ఆలయాలకు సంభందించిన వాటిపైనే ప్రభుత్వం పెత్తనం చేస్తుందని,అన్యమతస్తుల మతస్తులకు సంబంధించన వాటిపై ఎందుకు పెత్తనం చేయడం లేదని ఆయన ప్రశ్నించారు..ప్రభుత్వం కొత్త చట్టంను ప్రవేశ పెట్టాలని బిజేపి తరపున డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు..ప్రభుత్వం రాజకీయ కోణంలో తీసుకోకుండా దేవాలయాల నిర్మాణంకు,ధూపదీప నైవేద్యాలు ఇస్తున్న డబ్బును రాష్ట్ర నిధుల నుండి ఇవ్వాలని,రాష్ట్ర నిధుల నుండి చర్చిలు,దర్గా,మసీదుల నిర్మాణంకు ఎలా ఇస్తారని ఆగ్రహం వ్యక్తం చేసారు..అన్ని మతాలను సమానంగా చూస్తూ హిందూ దేవాలయాల నుండి తీసుకుంటున్న 21 శాతం ట్యాక్స్ ను వేంటనే రద్దు చేయాలని బిజేపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విష్ణు వర్ధన్ రెడ్డి డిమాండ్ చేసారు.

# మొక్కలు నాటే కార్యక్రమాన్ని తలపెట్టిన అఖిల భారత చిరంజీవి యువత

నెల్లూరు ఆగస్టు 13, (న్యూస్ పల్స్) అఖిలభారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో భారత దేశ వ్యాప్తంగా మొక్కలు నాటి పెంచి పోషించేందుకు శ్రీకారం చుట్టింది . ఇందులో భాగంగానే తమిళనాడు లోని చెన్నై నగరానికి చెందిన చిరంజీవి యువత నాయకులు క్రోమ్ పేట నందు అన్నయ్య చిరంజీవి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని పలు ప్రాంతాలలో పచ్చని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమానికి నెల్లూరు జిల్లా నివాసులు, చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవ సేవయే మాధవ సేవగా చిరంజీవి యువత ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల రీత్యా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటి పెంచాల్సిన బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పేరుతో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న పరిశ్రమల కారణంగా అత్యధిక కాలుష్యం ఏర్పడిందన్నారు. ప్రస్తుతం విశ్వమంతా ఆవరించియున్న కాలుష్యాన్ని నివారించేందుకు పచ్చని మొక్కలు నాటాలని అవసరం ఉందన్నారు. అందులో భాగంగానే చిరంజీవి సూచనలు సలహాలతో తమ వంతు చేయూతగా అఖిల భారత చిరంజీవి యువత ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని తన సంతోషాన్ని వ్యక్తపరిచారు. అఖిల భారత చిరంజీవి యువత తలపెట్టిన మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో చిరంజీవి యువత రాష్ట్ర నాయకులు కొట్టే వెంకటేశ్వర్లు పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చెన్నై నగర చిరంజీవి యువత నాయకులు ఆర్ముగం వెంకటేశ్వర్లు , జయశంకర్,మురళి, తదితరులు పాల్గొన్నారు.

# పాలిచర్లపాడులో అంకమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

## గ్రామ పొంగళ్ళు, పోతురాజు శిలలు ఏర్పాటు

నెల్లూరు ఆగస్టు 13, (న్యూస్ పల్స్) నెల్లూరు జిల్లా, వెంకటాచలం మండలం, పాలిచర్ల పాడు గ్రామంలో శ్రీ శ్రీ అంకమ్మ తల్లి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు మరియు గ్రామ పొంగళ్ళు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమాలు ఆయా దేవస్థాన కమిటీలు మరియు గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లి దేవస్థాన ప్రాంగణంలో శాస్త్రోక్తంగా పోతురాజు శిలలు ఏర్పాటు చేశారు. అనంతరం అంకమ్మ తల్లి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, చక్కెర పొంగళ్ళు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులకు, భక్తులకు అమ్మ వారి ప్రసాదం పులిహోర మరియు గుగ్గిళ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా అంకమ్మ తల్లి దేవస్థాన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమ పూర్వీకుల కాలం నుండి ఇ గ్రామదేవతగా అంకమ్మ తల్లి ని పూజించడం జరుగుతుందన్నారు. తల్లి చల్లని చూపులతో, ఆశీస్సులతో గ్రామంలోని ప్రజలకు ఎటువంటి చీడా,పీడా లేకుండా ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు అంకమ్మ తల్లి కృప ఉందన్నారు. నియమనిష్ఠలతో అమ్మ ను పూజించి కోరిన కోర్కెలు నెరవేర్చడంలో అంకమ్మ తల్లి కి ఆమే సాటి అని, తల్లి కరుణాక కటాక్షాలు గురించి వివరించారు .ఈ కార్యక్రమంలో అంకమ్మ తల్లి దేవాలయం కమిటీ చైర్మన్ పాలిచర్ల ఏడుకొండలు, వైస్ చైర్మన్ శివ, కార్యక్రమ నిర్వాహకులు కంటేపల్లి ప్రసాద్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# వేదగిరి లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో మౌలిక వసతులకు చేయూత అందించిన ఫెడోరా సీ ఫుడ్స్

## ఆధునిక వసతులను లాంఛనంగా ప్రారంభించిన ఎమ్మెల్యే కోటంరెడ్డి

నెల్లూరు ఆగస్టు 13, (న్యూస్ పల్స్) నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ పరిధిలోని శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలో పాల్గొని ఫెడోరా సీఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్, నెల్లూరు వారి సహాయసహకారంతో స్వామివారి పవిత్రోత్సవ మండపం, గాలిగోపురం లోపల అనివేటి మండపం మరియు నూతన వంటశాలలను నెల్లూరు గ్రామీణ నియోజకవర్గ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానాన్ని జిల్లాలో పర్యాటక కేంద్రంగా తీర్చిదిదేందుకు కృషిచేస్తా తనవంతు కృషి చేస్తానన్నారు.

శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానాన్ని అభివృద్ధి చేసేందుకు స్థానిక ఎమ్మెల్యే గా నేను మరియు జిల్లా కలెక్టర్ 50 కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపించటం జరిగిందని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు పర్యాటక, దేవాలయాల అభివృద్ధికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి చేస్తున్న కృషి ప్రశంసనీయం అని జిల్లా కలెక్టర్ చక్రధర్ బాబు అన్నారు. నెల్లూరు గ్రామీణ నియోజకవర్గంలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ వేదగిరి లక్ష్మి నరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి అన్నివిధాలా ఆర్థిక సహకారం అందిస్తున్న టువంటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డికి, రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డికి, జిల్లా కలెక్టర్కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయాల్సి ఉందన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే కార్యాలయ ఇన్చార్జి కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి మరియు ఆలయ కమిటీ చైర్మన్ ఇందూపూర్ శ్రీనివాస్ రెడ్డి ,దేవరపాలెం సర్పంచ్ వేమిరెడ్డి అశోక్ రెడ్డి, ఉపసర్పంచ్ వేమిరెడ్డి సురేంద్ర రెడ్డి, అగ్రికల్చర్ మార్కెటింగ్ చైర్మన్ ఛైర్మెన్ యేసు నాయుడు, ఎండోమెంట్ అసిస్టెంట్ కమిషనర్ మరియు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసులు రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, వైకాపా సీనియర్ నాయకులు కోడూరు కమలాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యం లో "నా దేశం నా జెండా"

## 75 వ స్వాతంత్ర్య ఉత్సవాలు ఘనంగా ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 3200 స్థలాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ నిర్వయించడం జరుగుతుంది ఏబీవీపీ




ఎమ్మిగనూరుఆగస్టు 13, ( విభారె) )విదేశీపాలకుల బానిస సంకెళ్లు తెంచుకొని ఈ భరతభూమికి స్వాతంత్ర్యం సిద్దించి 74 వసంతాలు పూర్తి చేసుకుని 75వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా 1,25,000 స్థలాల్లో, ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా 3200 స్థలాల్లో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమాల్లో యువత, విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఏబీవీపీ ఎమ్మిగనూరు బాగ్ కన్వీనర్ మారుతి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఎంతో మంది వీరుల ప్రాణత్యాగం ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి ఈ ఆగస్టు 15న 75 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న శుభ సందర్భాన్ని పురస్కరించుకొని దేశ వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ లో భాగంగా ఏబివిపి ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా 3,200 స్థలాల్లో జాతీయ జెండా ఆవిష్కరణ నా దేశం నా జెండా నినాదంతో స్వతంత్ర సమరయోధుల స్ఫూర్తిని,ఆశయాలను నేటి యువతకు,విద్యార్థిలోకానికి అందిస్తూ, స్వాతంత్ర్య పోరాటంలో ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను భావితరాలకు మనం వివరించాల్సిన అవసరం ఉంది. వారిని స్మరించుకుంటూ ప్రతి గ్రామంలో జాతీయ జెండా ఆవిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భరత్,పవన్ రఘునాథ్,సూర్య మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నరవ రమాకాంత్ రెడ్డి

## మంత్రాలయం నియోజకవర్గానికి టిడిపిలో రాష్ట్ర కేడర్ తెలుగు తమ్ముళ్లలో సంతోషం



మంత్రాలయం ఆగస్టు 13, ( విభారె) : మంత్రాలయం నియోజకవర్గం పరిధిలోని పెద్దకడబూరు మండలానికి చెందిన టిడిపి సీనియర్ నాయకుడు నరవ రమాకాంత్ రెడ్డి గారిని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించిన తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు పెద్దకడబూరు టీడీపీ మండల కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీనియర్ నాయకుడు మనసున్న మహారాజు అయినటువంటి నరవ రమాకాంత్ రెడ్డి గారు టిడిపి పార్టీకి చేసిన సేవలను గుర్తించి టిడిపి జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు గారు రాష్ట్ర అధికార ప్రతినిధి గా నియమించడం మంత్రాలయం నియోజకవర్గంలోనే కాకుండా కర్నూలు జిల్లాలో కూడా నాయకులలో కార్యకర్తలలో నూతనుత్తేజం నింపుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నరవ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి పార్టీతోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఒక్క ఛాన్స్ ఒక్క ఛాన్స్ అంటూ ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన జగన్ రాష్ట్రాన్ని అప్పుల కుంపటిలో నెట్టి రాష్ట్ర ప్రజలు అందరినీ మోసం చేశారని దుయ్యబట్టారు. రాష్ట్ర అభివృద్ధి ప్రదాత అయిన చంద్రబాబు నాయుడు మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలందరూ కోరుకుంటున్నారని ఆయన అన్నారు. టిడిపి పార్టీలో నా సేవలను గుర్తించి నన్ను టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడంతో చంద్రబాబు నాయుడు గారికి ,యువనాయకుడు లోకేశ్ గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అలాగే రాష్ట్ర అధ్యక్షులు అచ్చం నాయుడు గారికి మంత్రాలయం నియోజకవర్గం టీడీపీ ఇన్చార్జి పాలకుర్తి తిక్కా రెడ్డి గారికి కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అధికారంలోకి లేకపోయినా నా వెన్నంటే ఉండి నన్ను ప్రోత్సహించిన పెద్దకడబూరు మండలం టిడిపి కన్వీనర్ బసల దొడ్డి ఈరన్న మరియు టిడిపి నాయకులు కార్యకర్తలకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేశారు. అక్కడ నియోజకవర్గ పరిధిలోని మండల టిడిపి సీనియర్ నాయకుడు టిడిపి రాష్ట్ర నరవ రమాకాంత్ రెడ్డి ని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడంతో మంత్రాల నియోజకవర్గానికి రాష్ట్ర స్థాయిలో ప్రాముఖ్యత ఉన్న క్యాడర్ లభించడం పట్ల నాయకులు కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. మంత్రాలయం నియోజకవర్గం నాయకులు కూడా రాష్ట్ర స్థాయిలో పార్టీలో పదవులు అలంకరించడంతో మంత్రాల నియోజకవర్గానికి రాజకీయంగా మంచి రోజులు వచ్చాయి అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో క్యాడర్ ఉండటం వల్ల నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందని ప్రజలు భావిస్తున్నారు.నరవ రమాకాంత్ రెడ్డికి టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గా పదవి లభించడం పట్ల అభిమానులు కార్యకర్తలు తెలుగుతమ్ముళ్లు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఆశా వర్కర్లు కనీస వేతనం ,ఉద్యోగ భద్రత కై చలో విజయవాడ ఏ ఐ టి యూ సి పిలుపు ..

డోన్ ఆగస్టు 13, ( విభారె), :ఆశ వర్కర్లు కనీస వేతనం ఉద్యోగ భద్రత పై చలో విజయవాడకు సిద్ధం కావాలని ఏ ఐ టి యు సి జిల్లా అధ్యక్షులు పి సుంకయ్య ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సుగుణమ్మ ఏఐటియుసి డోన్ నియోజకవర్గ అధ్యక్షా కార్యదర్శులు పుల్లయ్య అబ్బాస్ పిలుపునిచ్చారు.శుక్రవారము స్థానిక కార్మిక కార్యాలయం ముందు ఆశా కార్యకర్తల ముఖ్య సమావేశం జరిగింది ఈ సమావేశాన్ని ఉద్దేశించి నాయకులు సుంకయ్య సుగుణమ్మ మాట్లాడుతూరాష్ట్రంలో ఆశా వర్కర్లు మహిళ గర్భందాల్చిన నాటి నుండి ప్రసవం అయ్యేంత వరకు వారి రక్షణగా సేవలందిస్తూ ప్రతిరోజు ప్రజల ఆరోగ్యం కొరకు జరిగే మలేరియా సర్వే, కుష్టు రోగుల సర్వే, న్యూమోనియా, టీబి వ్యాధిగ్రస్తులకు మందులు ఇస్తూ ప్రజల ప్రజల తలలో నాలుక లాగా నిత్యం సేవలందిస్తున్న ఇలాంటి ఆశ వర్కర్లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సేవలు చేయించుకున్నారు తప్ప వారి శ్రమకు తగ్గ వేతనం ఇవ్వడం లేదు గౌరవ వేతనం పేరుతో వారి శ్రమను దోచుకుంటున్నారు అనేక సంవత్సరాలుగా ఏఐటియుసి జాతీయస్థాయిలో పోరాటాలు ఆందోళనలు చేసి ప్రభుత్వ సంక్షేమ పథకాలలో పని చేస్తున్నా స్కీం వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక చట్టాలు అమలు చేయాలని వీరిని సేవకులుగా కాకుండా కార్మికులుగా గుర్తించి కనీస వేతనం పి యఫ్, ఈ యస్ ఐ ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వ ఉద్యోగులు గుర్తించాలని పోరాటం చేసిన ఫలితంగా ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ లో తీర్మానం చేయడం జరిగింది. అయితే దేశంలో ఎక్కడ స్కీమువర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించలేదు అందుకే తప్పని పరిస్థితిలో తమ సమస్యల పరిష్కారం కోసం ఈనెల 3వ తేదీన పి హెచ్ సి సెంటర్ లో వినతి పత్రం,6వతేది ఎండిఓ కార్యాలయం దగ్గర అ ధర్నా ,అలాగే 10వతేది డి ఎం హెచ్ ఓ కార్యాలయం ముందు నిరసన ,చివరిగా ఈనెల 17వ తేదీన చలో విజయవాడకు కదాలలని వారు పిలుపునిచ్చారు ఈ సమావేశంలో ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం మానవత్వం చాటుకున్న ప్రదీప్ రెడ్డి

మంత్రాలయం ఆగస్టు 13, ( విభారె): మండల పరిధిలోని చిలకలదోన గ్రామానికి చెందిన బోయ నాగేంద్ర చాకలి నారాయణ,బోయ రంగన్నలు ఎక్సెల్ టూ వీలర్ వాహనంపై వెళ్తుండగా చిలకలదోన కల్లుదేవకుంట గ్రామాల మధ్య ముగ్గురు ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనంను గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బోయ నాగేంధ్ర ,చాకలి నారాయణ అక్కడికక్కడే మృతి చెందారు.రంగన్నకు తీవ్ర గాయాలయ్యాయి.మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ రాష్ట్ర కమిటీ సభ్యులు ప్రదీప్ రెడ్డి గురువారం చిలకలదోణ గ్రామానికి చేరుకొని మృత దేహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం తక్షణ సహాయం కింద పదివేల రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేసి మానవత్వం చాటుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి బీమా పథకం నగదు వచ్చే విధంగా చూడాలని గ్రామ వార్డు సచివాలయ సిబ్బందికి సూచించారు. ఎవరికి ఎలాంటి ఆపద వచ్చినా మా కుటుంబం అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

# 68 చెరువులకు నీటిని నింపాలి

## ఏ పి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య

డోన్ ఆగస్టు 13, ( విభారె): జిల్లాలోని ప్రధాన 68 చెరువుల కు నీటిని నింపాలని రాష్ట్ర రైతు సంగమ్ అధ్యక్షుడు రామచంద్రయ్య డిమాండ్ చేశారు,స్థానిక డోన్ పట్టణంలో మార్కెట్ యార్డ్ ఎదురుగా ఉన్న ఆవరణలో రైతు సదస్సు ను ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డోన్, పత్తికొండ నియోజకవర్గ పరిధిలోని 9 మండలాల రైతు సంఘం నాయకులు, సీపీఐ నాయకులు సదస్సును నిర్వహించారు,సందర్భంగా రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రయ్య రైతుల ఉద్దేశించి మాట్లాడుతూ కర్నూలు జిల్లా లోని హంద్రీనీవా ప్రాజెక్టు ప్రధాన కాలువ ద్వారా ఎడమవైపు ఉన్న 68 చెరువుల కు నీటిని నింపాలి అనీ డిమాండ్ చేశారు, హంద్రీనీవా ప్రాజెక్టు నుంచి గత నాలుగు సంవత్సరాలుగా నీరు సంవృద్ధి గా ప్రవహిస్తోంది, కానీ పంట పొలాలకు మాత్రం నీరు రావడం లేదు,అధికారం లో ఉన్న వైస్సార్ ప్రభుత్వం,పాలకులుఏమాత్రం పట్టించుకోకుండా ఉన్నారు,నీటి ప్రాజెక్టులపై శ్రద్ధ చూపడం లేదని అన్నారు, సంక్షేమ పథకాలు అని డబ్బులు ఇచ్చే శ్రద్ధ,నీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవడం లేదని అన్నారు, కరువు నివారణకు ఎటువంటిచర్యలు తీసుకోవడం లేదనీ,శాస్వితంగా ప్రాజెక్టు ద్వారా 68 చెరువుల కు నీటిని నింపాలి అనీ ఈ నెల 21 నుంచి23 వరకు హంద్రీనీవా ప్రాజెక్టు వద్ద ఉన్న చెరువుల సందర్శన లో అధిక సంఖ్యలో రైతులు పాల్గొనాలని రైతులకు కోరారు, ఈ కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ పట్టణ కార్యదర్శి రంగ నాయుడు, నక్కి శ్రీకాంత్, ఏ ఐ టి యూ సి జిల్లా అధ్యక్షుడు సుంకయ్య, వ్యవసాయ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి రాధ కృష్ణ, తుగ్గలి మండల కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా నాయకులు రాజా సాహెబ్, జగదీష్, కృష్ణ, మధవకృష్ణ,శివ, తిమ్మయ్య, రాముడు, సుధాకర్, నారాయణ,చిన్న రంగన్న,మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు

# లుక్ లోనూ ప్రయోగాలకు వెరవని పాల్



ట్యాలెంటెడ్ బ్యూటీ అమలాపాల్ కెరీర్ పరంగానే కాదు.. స్టైలింగ్ ఫ్యాషన్స్ పరంగానూ ప్రయోగాలతో ఆకట్టుకుంటుందన్న సంగతి తెలిసినదే. పాల్ స్టైలిష్ ఎలివేషన్స్ లో గురించి చెప్పాల్సిన పనిలేదు. హాటెస్ట్ కంటెంట్ తో అల్ట్రా మోడల్ లుక్ లో కనిపించడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తుంది. డిజైన్ కాస్ట్యూమ్స్ ని హైలైట్ చేస్తూనే కిల్లర్ లుక్స్ తో కట్టిపడేస్తుంది.తాజాగా ఈ కేరళ కుట్టి మరోసారి తనదైన మార్క్ లుక్ లో ఆకర్షణీయంగా కనిపించింది. వైట్ హాల్టర్ క్రాప్ టాప్ హాఫ్ షోల్డర్ డ్రెస్ లో ఎంతో అందంగా కనిపిస్తున్న ఫోటోని సోషల్ మీడియాల్లో షేర్ చేయగా వైరల్ గా మారింది. బాటమ్ లో నలుపు..తెలుపు..లైట్ ఆరెంజ్ కలర్ ప్యాంటును ధరించింది. ట్రైకలర్ ప్యాంట్ లుక్ పరంగా హైలైట్ గా నిలిచింది.పోనీ టెయిల్ హెయిర్ తో .. కళ్లు పెద్దవి చేసి.. ఓర చూపుల వలలు విసిరి కిల్లింగ్ లుక్స్ తో ఆకట్టుకుంది. డిజైనర్ లుక్ ర్ కి తగ్గ మేకప్ తో ప్రకాశంతంగా మెరుస్తోంది. ఈ ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేసి అభిమానులను ఖుషీ చేసింది. ఫ్యాన్స్ ఆసక్తికర కామెంట్లతో హీటెక్కిస్తున్నారు. ఇక కెరీర్ విషయానికి వస్తే.. ఇటీవలే తెలుగులో పిట్ట కథలు సిరీస్ లో కనిపించింది. అలాగే తమిళ్..మలయాళ భాషల్లోనూ ఒకటి రెండు సినిమాల్లో నటిస్తోంది. మరోవైపు డిజిటల్ మీడియా లోనూ అమ్మడు దూసుకుపోతుంది. వెబ్ సిరీస్ లపైనా దృష్టి పెట్టి ఆ రంగంలోనూ రాణించాలని కమిట్ మెంట్ తో ముందుకెళుతోంది .వ్యక్తిగత జీవితంలో తగిలిన ఎదురుదెబ్బలను సైతం ఎంత మాత్రం లెక్కచేయకుండా కెరీర్ ఆలోచనలతో ముందుకు సాగిపోతుంది. అమలాపాల్ ని కెరీర్ పరంగా దెబ్బ తీయాలని కోలీవుడ్ ఇండ్రీలో ఆమెపై నెగివిటీని తీసుకొచ్చే ప్రయత్నం చేసారు. కానీ వాటికి తనదైన ప్రతిభతో సమాధానమిస్తూ తెలివిగా ముందుకు వెళుతోందని కథనాలొస్తున్నాయి. అధో ఇదో పరవై పోలా...ఆడుజీవితం చిత్రాల్లో అమలాపాల్ నటిస్తోంది


# మైండ్ బ్లాక్ చేసిన 54 ఏళ్ల క్లాసికల్ దేవత..!



ఆమె వయసు 54. కానీ ఈ లుక్ చూశాక 24 అని కన్ఫ్యూజ్ అవ్వడం ఖాయం. అంత ఛామింగ్ గా బ్యూటిఫుల్ గా కనిపిస్తున్నారు వెటరన్ నటి మాధురి ధీక్షిత్ నీనే. అంతకంతకు తన వయసు తగ్గిపోతున్నట్టే కనిపిస్తోంది. తాజాగా అద్భుతమైన డిజైనర్ లెహంగాతో మాధురి టాక్ ఆఫ్ ది టౌన్ గా మారారు. 54 ఏళ్ల మాధురి ఆలస్యమయ్యే కొద్దీ రంగు రుచి మారే వైన్ లాగా మాధుర్యంతో కనిపిస్తున్నారని యూత్ ఘాటుగానే వ్యాఖ్యానిస్తున్నారు.మాధురీ ఇన్ స్టా జామ్ అయిపోతోందిప్పుడు. తన కొత్త చిత్రాలను పోస్ట్ చేసింది మొదలు వైరల్ గా షేర్ అవుతున్నాయి. ఏజ్డ్ బ్యూటీ మేకోవర్ సర్ ప్రైజ్ చేస్తోంది. బాటిల్ గ్రీన్-టర్కోయిస్ రంగులలో క్లిష్టమైన ఎంబ్రాయిడరీ చోళీని ధరించి మాధురి ఫ్యాషన్ ని రీడిఫైన్ చేశారంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. ఆ హెయిర్ ని అందంగా డిజైన్ చేసారు. మాధురి సువావ్ మౌవ్ లిప్ కలర్ మెరిసే ఐషాడో యూనిక్ అని ప్రశంసించాలి.మాధురి కెరీర్ మ్యాటర్ కి వస్తే వరుసగా రియాలిటీ షోల జడ్జిగా కొనసాగుతున్నారు. హిందీ డాన్స్ షో 'దీవానే 3' కి జడ్జిగా తిరిగి కొనసాగుతున్నారు. ఈ లెహంగా రియాలిటీ వేదిక కోసం ప్రత్యేకంగా డిజైన్ చేసినదే. ఈ లుక్ లో మాధురి అతిలోక సుందరి 2 లా కనిపిస్తోందని ఒక సెక్షన్ అభిమానులు వ్యాఖ్యానించడం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకవేళ మెగాస్టార్ జగదేక వీరుడు అతిలోక సుందరి సీక్వెల్ సినిమా తీస్తే అందులో మాధురికి ఆఫర్ చేస్తారేమో చూడాలి. ఇక మాధురికి మామ్ శ్రీదేవికి ఉన్న ఆసక్తికర కనెక్షన్ గురించి తెలిసినదే. ఆ ఇద్దరూ కథానాయికలుగా వెలిగే క్రమంలో చాలా కాలం దూరంగానే ఉన్నారు. కానీ శ్రీదేవి మరణానంతరం తనతో స్నేహాన్ని మిస్ చేసుకున్నందుకు చాలా బాధపడ్డానని మాధురి అన్నారు.

# 'కేజీయఫ్ 2' కు భారీ ఓటీటీ ఆఫర్..?

కన్నడ రాకింగ్ స్టార్ యష్ - డైరెక్టర్ ప్రశాంత్ నీల్ కాంబోలో రూపొందుతున్న బిగ్గెస్ట్ యాక్షన్ ఎంటర్టైనర్ "కేజీయఫ్: చాప్టర్ 2". పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ సాధించిన 'కేజీయఫ్ 1' చిత్రానికి కొనసాగింపుగా ఈ సినిమా రూపొందుతోంది. చాప్టర్-1 భారీ విజయం నమోదు చేయడంతో పార్ట్-2 పై సినీ అభిమానులు భారీ అంచనాలు పెట్టుకున్నారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు - టీజర్ ఈ సినిమా ఏ రేంజ్ లో ఉండబోతుందో హింట్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో 'కేజీయఫ్ 2' నాన్ థియేట్రికల్ రైట్స్ భారీ ధర పలుకుతున్నట్లు తెలుస్తోంది.అయితే లేటెస్టుగా ప్రముఖ ఓటీటీ సంస్థ 'కేజీయఫ్ 2' డిజిటల్ రైట్స్ కోసం భారీ ఆఫర్ తో వచ్చిందట. థియేట్రికల్ రిలీజ్ స్కిప్ చేసి డైరెక్ట్ ఓటీటీ రిలీజ్ కు ఇస్తే 'ఆర్. ఆర్.ఆర్' కంటే ఎక్కువ మొత్తాన్ని ఇవ్వనున్నట్లు ఆశ చూపిందట. అయితే మేకర్స్ మాత్రం ఈ డీల్ కు ఒప్పుకోలేదని తెలుస్తోంది. ఫస్ట్ పార్ట్ సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకొని థియేటర్లలోనే ఈ పాన్ ఇండియా చిత్రాన్ని విడుదల చేయాలని వారు నిర్ణయించుకున్నారు. హీరో యష్ సైతం ఎన్ని రోజులు లేట్ అయినా బిగ్ స్క్రీన్ మీదకే వస్తామని ఆ మధ్య ప్రకటించారు.ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న 'కేజీయఫ్: చాప్టర్ 2' సినిమా విడుదల తేదీపై త్వరలోనే క్లారిటీ రానుంది. ప్రస్తుతానికి సౌత్ లో మాత్రమే థియేటర్లలో సినిమాలను రిలీజ్ చేస్తుండగా.. నార్త్ లో ఇంకా పరిస్థితులు సానుకూలంగా మారలేదు. నేషనల్ వైడ్ రిలీజ్ చేయాల్సిన సినిమా కావడంతో..



అనువైన విడుదల తేదీ గురించి మేకర్స్ ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది. నిజానికి కరోనా సెకండ్ వేవ్ ప్రభావం పడకపోయుంటే జులై 16న 'కేజీయఫ్' సీక్వెల్ ప్రేక్షకుల ముందుకు వచ్చేది. మరి ఇప్పుడు కన్నడ బాహుబలి ని ఏ సీజన్ లో థియేటర్లలోకి తీసుకోస్తారో చూడాలి.కాగా 'కేజీఎఫ్ 2' చిత్రంలో యష్ సరసన శ్రీనిధి శెట్టి హీరోయిన్ గా నటిస్తోంది. బాలీవుడ్ స్టార్స్ సంజయ్ దత్ - రవీనా టాండన్ లతో పాటుగా ప్రకాష్ రాజ్ - రావు రమేష్ - ఈశ్వరీ రావు తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. రవి బస్రూర్ ఈ చిత్రానికి సంగీతం సమకూర్చారు. హోంబలే ఫిలింస్ బ్యానర్ పై విజయ్ కిరగందూర్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్ తో నిర్మిస్తున్నారు.

# కేఎల్ రాహుల్.. ఔటైనా రికార్డు సాధించాడు




లార్డ్స్: ఇంగ్లండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో కేఎల్ రాహుల్ శతకంతో మెరిసిన సంగతి తెలిసిందే. ఇప్పటికే పలు రికార్డులు సాధించిన రాహుల్ తాజాగా రెండో రోజు ఆట ప్రారంభంలోనే ఓలి రాబిన్సన్ బౌలింగ్‌లో 129 పరుగులు వ్యక్తిగత స్కోరు వద్ద ఔటయ్యాడు. కేఎల్ రాహుల్ ఔటైనప్పటికి ఒక రికార్డు అందుకున్నాడు. లార్డ్స్ టెస్టులో భారత్ తరపున సెంచరీ సాధించడంతో పాటు అత్యధిక స్కోరు నమోదు చేసిన జాబితాలో నాలుగో స్థానంలో ఉన్నాడు. ఇంతకముందు 1952లో వినూ మన్కడ్ (184 పరుగులు), 1982లో దిలీప్ వెంగ్‌సర్కార్(157 పరుగులు), 1996లో సౌరవ్ గంగూలీ(131 పరుగులు) తొలి మూడు స్థానాల్లో నిలిచారు. అంతకముందు టెస్టు కెరీర్‌లో ఆరో శతకం చేసిన రాహుల్ లార్డ్స్ మైదానంలో సెంచరీ సాధించిన మూడో భారత ఓపెనర్‌గా రాహుల్ ఘనత సాధించాడు. అంతకుముందు రవిశాస్త్రి(1990), వినోద్ మన్కడ్(1952)లు మాత్రమే లార్డ్స్‌లో సెంచరీ సాధించిన భారత ఓపెనర్లు కాగా, వారి సరసన ఇప్పుడు రాహుల్ చేరిపోయాడు. కాగా, ఆసియా బయట టెస్టు ఫార్మాట్‌లో అత్యధిక సెంచరీలు చేసిన భారత ఓపెనర్ల జాబితాలో వీరేంద్ర సెహ్వాగ్‌తో కలిసి రాహుల్ రెండో స్థానాన్ని ఆక్రమించాడు. ఈ జాబితాలో సునీల్ గావస్కర్ 15 సెంచరీలతో తొలి స్థానంలో ఉండగా, సెహ్వాగ్-రాహుల్‌లు తలో నాలుగు సెంచరీలు సాధించారు. ఆ తర్వాత స్థానంలో వినోద్ మన్కడ్-రవిశాస్త్రిలు తలో మూడు సెంచరీలతో మూడో స్థానంలో ఉన్నారు. ప్రస్తుతం టీమిండియా 96 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 288 పరుగులు చేసింది.

# విలేకరి ప్రశ్నకు సలాం చేసిన రోహిత్.. ఎందుకో చూడండి..!

లండన్: భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య లార్డ్స్ వేదికగా గురువారం రెండో టెస్ట్ ప్రారంభమైన సంగతి తెలిసిందే. తొలి రోజు ఆట ముగిసే సమయానికి కోహ్లీ సేన 3 వికెట్ల నష్టానికి 276 పరుగులు చేసింది. ఓపెనర్ కేఎల్ రాహుల్(127) అజేయ సెంచరీతో అదరగొట్టగా, రోహిత్ శర్మ(83), కోహ్లీ(42)లు రాణించారు. తొలి రోజు ఆట అనంతరం ఓపెనర్ రోహిత్ శర్మ పాల్గొన్న వర్చువల్ మీడియా సమావేశంలో ఓ ఆసక్తికర సన్నివేశం తారసపడింది. ఈ సమావేశంలో విలేకరి అడిగిన ఓ ప్రశ్నకు రోహిత్ సెల్యూట్ చేశాడు. భారత స్వాతంత్ర దినోత్సవం జరుపుకోబోయే పంద్రాగస్టు నాడు విజయాన్ని గిఫ్ట్‌గా ఇస్తారా అని సదరు రిపోర్టర్ ప్రశ్నించగా, పై విధంగా స్పందించాడు. అలా జరగాలనే కోరుకుంటున్నాము.. అదే జరిగితే అది భారత క్రికెట్‌కు గొప్ప గౌరవంగా నిలుస్తుందని బదులిచ్చాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**